teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 391 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 4 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## యాదాద్రి దేవస్థానంలో స్థానికులకు ఉచిత దర్శన సదుపాయం

ప్రతి మంగళవారం సా.5 గం.ల నుండి 5.30 గం.ల వరకు

ఆలయ ట్రస్ట్ అధికారుల ప్రకటన

.. వివరాలు 2లో

# సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు రంగం సిద్ధం

### పోటా పోటీ అభ్యర్థుల మధ్య ఉత్కంఠ

### నేడే తేలనున్న ఎన్నికల ఫలితాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు

గొడవలకు ఆస్కారం లేకుండా రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ

మద్యం దుకాణాలు మూసేయాలని ఆదేశాలు జారీ





హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడి కానున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. తొలి ఫలితం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెలువడే అవకాశం ఉంది. తుది ఫలితం సాయంత్రం 6 గంటల వరకు వచ్చే అవకాశం ఉంది. తొలి ఫలితం నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో వెలువడనుంది. ఈ నియోజకవర్గంలో

మిగతా 2 లో

| లోక్ సభ స్థానం | రౌండ్లు |
|---|---|
| ఆదిలాబాద్ | 23 |
| పెద్దపల్లి | 21 |
| కరీంనగర్ | 24 |
| నిజామాబాద్ | 15 |
| జహీరాబాద్ | 23 |
| మెదక్ | 23 |
| మల్కాజ్‌గిరి | 21 |
| సికింద్రాబాద్ | 20 |
| హైదరాబాద్ | 24 |
| చేవెళ్ల | 23 |
| మహబూబ్‌నగర్ | 21 |
| నాగర్‌కర్నూల్ | 22 |
| నల్లగొండ | 24 |
| భువనగిరి | 23 |
| వరంగల్ | 18 |
| మహబూబాబాద్ | 22 |
| ఖమ్మం | 21 |





## ఎన్నికల కోడ్ ముగియగానే జీరో బిల్లుల జారికి డిస్కం నిర్ణయం

### 200 యూ. లోపు వినియోగదారులకు సున్నా బిల్లు

### గృహజ్యోతి అర్హులకు కోడ్ ముగియగానే సున్నా బిల్లులు

రంగారెడ్డి జోన్ పరిధిలో అర్హులైన విద్యుత్తు వినియోగదారులకు ఈ నెల నుంచే గృహజ్యోతి పథకం అమల్లోకి రానుంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియగానే 6వ తేదీ నుంచి బిల్లులు జారీ చేయాలని డిస్కం నిర్ణయించింది. 200 యూనిట్ల లోపు వినియోగదారులకు సున్నా బిల్లు జారీ చేయనున్నారు.

హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్):మిగతా వినియోగదారులకు ఈ నెల 1 నుంచే బిల్లింగ్ ప్రక్రియ మొదలు కాగా గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి

మిగతా 2 లో

## జూన్ 5 నుంచి పీఎం కిసాన్ రైతుల కోసం స్పెషల్ సర్వీసులు

17వ విడత సొమ్ము ఖాతాల్లో జమకావాలంటే ఇది తప్పనిసరి

ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం అవసరం



తెలంగాణ బ్యూరో, జూన్ 03 (తీన్మార్ న్యూస్): పీఎం కిసాన్ రైతులకు భారీ అప్డేట్. జూన్ 5 నుంచి పీఎం కిసాన్ రైతుల కోసం స్పెషల్ సర్వీసులు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ స్కీమ్‌ను ఎంతో ప్రతిష్టాత్మంగా అమలు చేస్తోంది. తాజాగా ఈ స్కీమ్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ప్రభుత్వం అన్నదాతలకు ఊరట కలిగే నిర్ణయం తీసుకుంది. దీని వల్ల చాలా మందికి బెనిఫిట్ పొందే

మిగతా 2 లో



## వారం ముందే రాష్ట్రాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు

### సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం

### అంచనా వేసిన వాతావరణ శాఖ

తెలంగాణ బ్యూరో, జూన్ 03 (తీన్మార్ న్యూస్): నైరుతి రుతుప వనాలు చురుగ్గా కదులుతున్నాయి. నాలుగు రోజుల క్రితం మే 30న కేరళలోకి ప్రవేశించిన రుతుపవనాలు ఆదివారం (జూన్ 2) కర్ణాటక మీదుగా ఏపీలోని రాయలసీమలోకి ఎంటర్ అయ్యాయి. సోమవారం (జూన్ 3) తెలంగాణను తాకాయి. నాగర్ కర్నూలు, గద్వాల, నల్గొండ, మీదుగా ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం తెలంగాణలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారంలో

మిగతా 2 లో



## రాష్ట్ర చిహ్నంలో మార్పులపై స్పందించిన మంత్రి సీతక్క

కాకతీయ కళాతోరణం తొలగింపుపై నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ

రాష్ట్రంలో మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం

ప్రభుత్వం ప్రకటించకముందే ఆందోళన చేయడం సరికాదు

వివరాలు 2 లో

## కవితకు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

కవితపై ఈడీ చార్జ్‌షీట్‌లో కీలక అంశాలు

సీబీఐ కేసులోనూ కస్టడీ పొడిగింపు

ఈడీ కేసులో జులై 3వ దాకా పొడిగిస్తూ స్పెషల్ కోర్టు ఆదేశాలు

బెయిల్ వచ్చేదాకా తీహార్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితే



న్యూ ఢిల్లీ, జూన్ 03 (తీన్మార్ న్యూస్) మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది స్పెషల్ కోర్టు. ఈడీ కేసులో జులై 3వ తేదీదాకా కస్టడీ పొడిగిస్తున్నట్లు సోమవారం ఉదయం ఆదేశాలిచ్చింది. దీంతో బెయిల్ వచ్చేదాకా ఆమె తీహార్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. లిక్కర్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ ముగియడంతో సోమవారం ఉదయం స్పెషల్ కోర్టుకు తీసుకొచ్చారు తీహార్ జైలు అధికారులు. ఈ సందర్భంగా కవితపై దాఖలైన ఈడీ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు

మిగతా 2 లో

## సార్వత్రిక ఎన్నికల 7విడతల్లో పాల్గొన్న 64.2 కోట్ల ఓటర్లు

### ప్రపంచంలోనే ఎక్కువ ఓటర్లు పాల్గొన్న ఎలక్షన్స్ గా ప్రపంచ రికార్డు

న్యూ ఢిల్లీ, జూన్ 03 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు 7 విడతల్లో జరిగింది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావడానికి దాదాపు రెండు నెలలు పైగా సమయం పట్టింది. ఏప్రిల్ 19న తొలి విడత ఎన్నికలతో ప్రారంభమై జూన్ 1 జరిగిన చివరి విడత ఎన్నికలతో మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఈ ఎలక్షన్స్ లో మన దేశంలో 64.2 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషన్ మీడియాకు

మిగతా 2 లో






## తెలంగాణ సెక్రటేరియట్ లో మూసివేసిన ప్రధాన గేటు

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల రాకపోకలలో పలు మార్పులు

స్వల్ప మార్పులు చేసినట్లు వెల్లడించిన సచివాలయ అధికారులు

వివరాలు 2 లో

## జూన్ 18న యూజీసీ నెట్ పరీక్ష

### 2024 నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ తేదిని ప్రకటించిన యూజీసీ




న్యూ ఢిల్లీ, జూన్ 03 (తీన్మార్ న్యూస్): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రతీయేట నెట్ పరీక్షలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా యూజీసీ నెట్ జూన్ 2024 పరీక్ష తేదీని నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రకటించింది. ఈ పరీక్షను జూన్ 18న

మిగతా 2 లో

## రాష్ట్ర గీతంపై మందకృష్ణ మాదిగ కీలక వ్యాఖ్యలు

### అందెశ్రీ రాసిన గీతాన్ని మార్చి సారం లేకుండా చేశారని ఫైర్



తెలంగా బ్యూరో, జూన్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర గీతంపై ఎమ్మార్పీఎస్ చీఫ్ మందకృష్ణ మాదిగ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కవి అందెశ్రీ రాసిన గీతాన్ని మార్చి సారం లేకుండా చేశారని ఫైర్ అయ్యారు. జూన్ 2న ఆమోదించిన కొత్త గీతాన్ని తెలంగాణ సమాజం ఆమోదించదని వెల్లడించారు. సమక్క సారక్క, కుమ్రంభీమ్ పేర్లను తొలగించారని, మంత్రి సీతక్క మనసు ఎలా ఒప్పుకుందని మండిపడ్డారు. కంచర్ల గోపన్నతో

మిగతా 2 లో



## కరెంట్ కోతల విషయంలో రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన కేటీఆర్

### కోతలపై క్లారిటీ ఇచ్చిన టీజీఎస్‌పీడీసీఎల్

హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): కరెంట్ కోతల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి కరెంట్ కోతలు లేవుని, 24 గంటలు నాణ్యమైన కరెంట్‌ను తమ ప్రభుత్వం

మిగతా 2 లో

## ఎన్నికల కోడ్ ముగియగానే జీరో బిల్లుల జారికి డిస్కం నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

కోడ్ ముగియగానే సున్నా బిల్లులు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా రంగారెడ్డి జోన్ పరిధిలోకి వచ్చే సైబరాబాద్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో సున్నా బిల్లులు మొదలు కాలేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఆహారభద్రత కార్డు కలిగిన అర్హులు 4 లక్షల పైనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో పథకం ప్రారంభించిన సర్కిళ్లలో అర్హత ఉండి సున్నా బిల్లులు రాని వారికి కూడా ఆరో తేదీ నుంచి జారీ చేయనున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో 12 లక్షల మంది ఆహారభద్రత కార్డు కలిగిన వారున్నారు.వీరందరికి సున్నా బిల్లులు జారీ కావాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో చాలామందికి అందలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోగా కోడ్ రావడంతో వారికి సున్నాబిల్లులు రాలేదు. వీరందరికీ 6వ తేదీ నుంచి సున్నా బిల్లులు జారీ కానున్నాయి.

## వారం ముందే రాష్ట్రాన్ని తాకిన నైరుతి రుతుప వనాలు

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. కానీ ఈ సారి వారం ముందుగానే రాష్ట్రంలోకి ఆగమనం జరిగింది. ఈ సారి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణలో పలుచోట్లతేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక మంగళవారం (జూన్ 4) నుంచి 3 రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జిల్లాలతో పాటు రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. కాగా ఆదివారం (జూన్ 2) హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురిసింది. సికింద్రాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.

## జూన్ 5 నుంచి పీఎం కిసాన్ రైతుల కోసం స్పెషల్ సర్వీసులు

**మొదటి పేజీ తరువాయి**

అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం జూన్ 5 నుండి జూన్ 15 వరకు పీఎం కిసాన్ సాచురేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రయోజనాలను పొందడానికి ఈ డ్రైవ్ ఉపయోగపడుతుంది. దీని ద్వారా అన్నదాతలు మీ ఇకేవైసీని పూర్తి చేసుకోవచ్చు. పీఎం కిసాన్ స్కీమ్ కింద డబ్బులు పొందే అన్నదాతలు ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. అలా చేయని రైతులకు రైతులు పీఎం కిసాన్ యోజన ప్రయోజనం పొందలేరు. అంటే 17వ విడత సొమ్ము వారి ఖాతాల్లో జమకాదు. మళ్లీ రూ. 2 వేలు పొందలేరు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన అనేది ప్రపంచంలోనే అతిపెద్ద డీబీటీ పథకం. ఇది రైతులకు సంవత్సరానికి రూ. 6 వేలు ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ డబ్బులు ఒకేసారి కాకుండా విడతల వారీగా అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో పడుతాయి. ఇ-కేవైసీ పూర్తి చేసుకోని రైతులు వెంటనే ఆ పని పూర్తి చేసుకోవాలి.నాలుగు నెలలకు ఒకసారి రూ. 2 వేల చొప్పున మొత్తంగా మూడు సార్లు రూ. 6 వేలు అర్హత కలిగిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం 16 విడతల డబ్బులను అందించింది. ఇకపై 17 వ విడత డబ్బులు రావాల్సి ఉంది. ఈ నెలలో లేదంటే వచ్చే నెల ఆరంభంలో ఈ డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడనున్నాయి. కేంద్ర ప్రభుత్వపు పీఎం కిసాన్ సాచురేషన్ డ్రైవ్ సమయంలో నాలుగు కీలక పనులను పూర్తి చేసుకోవచ్చు. రైతులు పీఎం కిసాన్ పోర్టల్ లేదా యాప్ ద్వారా ఇకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. అలాగే పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంకా భూమి వివరాలను పోర్టల్‌కు అప్‌లోడ్ చేయవచ్చు. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో లింక్ చేసుకోవచ్చు.మరింత సమాచారం కోసం, మీ సమీప %జూజ% (కామన్ సర్వీస్ సెంటర్) లేదా రాష్ట్ర సేవా కేంద్రాన్ని సందర్శించండి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ( జూన్ 4 ) ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత విడుదల అయ్యే అవకాశం ఉంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 16వ విడతను ఫిబ్రవరి 28న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు.

## కవితకు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి**

ఆ అభియోగ పత్రాలను కవిత తరపు న్యాయవాదికి అందజేసింది. ఆ వెంటనే ఈడీ కేసులో కస్టడీని మరో నెల రోజుల పాటు పొడిగిస్తున్నట్లు జడ్జి కావేరీ బవేజా వెల్లడించారు. ఇక కోర్టుకు వచ్చిన కవితను భర్త అనిల్, ఇద్దరు కొడుకులను కలిసేందుకు అనుమతిచ్చారు స్పెషల్ కోర్టు జడ్జి. అనంతరం కవితను తీహార్ జైలుకు తరలించారు.

**కవితపై ఈడీ చార్జ్‌షీట్‌లో కీలక అంశాలు**

**సీబీఐ కేసులోనూ కస్టడీ పొడిగింపు**

మరొకవైపు సీబీఐ కేసులో సైతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది కోర్టు. సీబీఐ కేసులో కవిత జ్యుడిషియల్ కస్టడీని జూన్ 7 వరకు పొడిగించింది రౌస్ అవెన్యూ కోర్టు. ఈ క్రమంలో కవిత పై చార్జ్ షీట్‌ను జూన్ 7న సీబీఐ దాఖలు చేయనుంది. సీబీఐ కేసులో భాగంగా సోమవారం మధ్యాహ్నం కవితను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు జైలు అధికారులు.

## రాష్ట్ర గీతంపై మందకృష్ణ మాదిగ కీలక వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

సహా కవుల పేర్లు గీతంలో ఎందుకు లేవని నిలదీశారు. అందెశ్రీ రాసిన పాటలో రెడ్డి సామాజిక వర్గం పేరు లేదని, ఇక వేరే కులాల పేర్లు ఎందుకు అని రేవంత్ రెడ్డి తీయించేసి ఉంటాడని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు విని అందెశ్రీ తన గౌరవాన్ని కోల్పోయారని అన్నారు. అందెశ్రీ రాసిన పాత గీతం ప్రజల హృదయాల్లో నిలిచిందని.. కొత్త గీతాన్ని చూస్తే పూర్తిగా వ్యతిరేకంగా కన్పిస్తున్నదని, ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్‌ను కలుస్తామని స్పష్టంచేశారు. మరోవైపు రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణాన్ని ఎందుకు తొలగిస్తున్నారు? అని ప్రశ్నించారు. సమ్మక్క సారక్కలను కాకతీయులు చంపితే.. గిరిజనులను పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్ కాదా? అని నిలదీశారు. చార్మినార్ మన వారసత్వ సంపద అని గుర్తుచేశారు

## కరెంట్ కోతల విషయంలో రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి**

సరాఫరా చేస్తుందని చెప్పారు. అలా చెప్పి 24 గంటలు కూడా కాకముందే ప్రజలు కరెంట్ కోసం ఉప్పల్‌లో రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారని ట్విట్టర్‌వేదిగా ఫైర్ అయ్యారు. దీనికి రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. అయితే కేటీఆర్‌ట్వీట్‌పై టీజీఎస్‌పీడీసీఎల్ స్పందించింది. ఆదివారం ఈదురుగాలులతో మాత్రమే విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడిందని క్లారిటీ ఇచ్చింది.

## తెలంగాణ సెక్రటేరియట్ లో మూసివేసిన ప్రధాన గేటు

హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సెక్రటేరియట్ లోకి ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారుల రాకపోకల విషయంలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. సచివాలయంలోకి సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ప్రధాన ద్వారం నుంచి లోపలికి ఎంట్రీ ఇవ్వగా ఇక నుంచి అధికారులు అందులో కొన్ని మార్పులు చేశాయి. ఇప్పటినుండి సీఎం కాన్వాయ్ వెస్ట్ గేట్ నుంచి లోపలికి వచ్చి నార్త్ ఈస్ట్ గేట్ గుండా బయటకు వెళ్లేటట్టు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ప్రధాన గేటును మూసివేశారు. అంతేగాక ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల రాకపోకల అంశంలో కూడా పలు మార్పులు చేసినట్లు సచివాలయ అధికారులు తెలిపారు. ఇకనుండి ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులు సౌత్ ఈస్ట్ గేట్ ద్వారా రాకపోకలు సాగిస్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సెక్రటేరియట్ ఎంట్రీ ఎక్జిట్ లపై మార్పులు చేయడం ఇదే మొదటిసారి. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని మాత్రమే ఆరో అంతస్థు నుంచి తొమ్మిదో అంతస్థుకు మార్చాలని అధికారులు నిర్ణయించగా ప్రస్తుతం తొమ్మిదో అంతస్థులో దానికి సంబంధించిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

# సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు రంగం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

కేవలం 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్ నియోజకవర్గాల ఫలితాలు చివరలో వెలువడే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గాల్లో 24 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. మొత్తానికి ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. గొడవలకు ఆస్కారం లేకుండా రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. గుంపులుగా తిరుగుతూ అల్లర్లకు తావివ్వకుండా ఆంక్షలు విధించారు. వేలాది మంది పోలీసు సిబ్బంది నిఘా ఉంచనున్నారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల దగ్గర మూడంచెల భద్రతా విధానం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్లో అల్లర్లకు అవకాశం లేకుండా జూన్ 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. మద్యం దుకాణాలు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎన్నికల సంఘం జారీ చేసిన పాసులు ఉన్న సిబ్బంది, వివిధ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు, మీడియా ప్రతినిధుల్ని మాత్రమే అనుమతించనున్నారు. రాజధానిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్గిరి, చేవెళ్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19 కౌంటింగ్ కేంద్రాలున్నాయి. ఒకే చోట పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట సగటున వెయ్యికి పైగా పోలీసులతో బందోబస్తు కల్పిస్తున్నారు. ఏమాత్రం నిబంధనలు అతిక్రమించినా వెంటనే అడ్డుకునేలా అడుగడుగునా సిబ్బందిని మోహరించారు.



## సార్వత్రిక ఎన్నికల 7విడతల్లో పాల్గొన్న 64.2 కోట్ల ఓటర్లు

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించింది. అంతేకాదు ప్రపంచంలోనే ఎక్కువ మంది ఓటర్లు పాల్గొన్న ఈ ఎలక్షన్స్ ప్రపంచ రికార్డు క్రియేట్ చేసిందని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ చెప్పారు. ఈయన తన తోటి ఎన్నికల కమిషనర్స్ అయినా జ్ఞానేష్ కుమార్, సుఖ్ బీర్ సింగ్ లతో కలసి ఎన్నికలు జరిగిన తీరుపై మాట్లాడారు. ఇక ఎన్నికల కౌంటింగ్ ముందు ఈసీ ఇలా ఓ ప్రెస్ మీట్ నిర్వహించడం ఇదే తొలిసారి. తాజాగా జరిగిన ఈ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది తమ ఓటుతో భావి భారత ప్రధానిగా ఎవరు ఉండాలనేది నిర్ణయించారు. అంతే కాదు జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఇది ఎక్కువ అన్నారు. యూరోప్ కంట్రీస్ లోని 27 దేశాల ఓటర్ల కంటే మనదేశంలో ఓటింగ్ పాల్గొన్నవారు 2.5 రెట్లు ఎక్కువ అని తెలిపారు. ఈ ఎన్నికల్లో సీ విజిల్ యాప్ ద్వారా నాలుగు లక్షల 56 వేల కంప్లైంట్స్ వచ్చాయి. అందులో 87.5 శాతం వంద నిమిషాల్లో సాల్వ్ చేసినట్టు చెప్పారు. ఎన్నికల్లో డీప్ ఫేక్ వీడియోల ఆగడాలను అరికట్టామన్నారు. మొత్తంగా 64.2 ఓటర్లలో 31.2 కోట్ల మంది మహిళా ఓటర్లు ఈ సారి ఓటు వేయడం విశేషమన్నారు. అంతేకాదు ప్రజాస్వామ్య విజయమన్నారు. దాదాపు ఒక కోటి 50 లక్షల పోలింగ్ సిబ్బంది ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించారు. దాదాపు 68,763 మంది ఈ ఎలక్షన్స్ ను డేగ కళ్లతో వాచ్ చేసినట్టు చెప్పుకొచ్చారు. దేశంలోని 27 స్టేట్స్, కేంద్రపాలిత ప్రాంతాల్లో రీ పోలింగ్ అవసరం పడలేదన్నారు. ప్రజలందరు స్వచ్ఛందంగా ఓటింగ్ లో పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. లాస్ట్ ఎలక్షన్స్ లో 540 చోట్ల రీ పోలింగ్ జరిగ్గా ఈ సారి అది 39 ప్రాంతాలకే పరిమితమైందన్నారు. దేశ వ్యాప్తంగా కేవలం రెండు రాష్ట్రాల్లో కేవలం 25 ప్లేస్ లలో మాత్రమే రీ పోలింగ్ నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించారు. గతంతో పోలిస్తే జమ్మూ కశ్మీర్ లో పోలింగ్ శాతం పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అక్కడ మొత్తంగా 58.58 పోలింగ్ పర్సంటేజీ నమోదు అయినట్టు చెప్పారు. అటు కశ్మీర్ లోయలో కూడా 51.05 శాతం పోలింగ్ జరగడం ప్రజాస్వామ్య విజయానికి పెద్ద నిదర్శనమన్నారు. ఈ ఎన్నికల్లో దాదాపు 10 వేల కోట్లకు పైగా నగదు, కానుకలు, మద్యం వంటివి సీజ్ చేసినట్టు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా జూన్ 4న తేదిన ఉదయం 8 గంటలకు 543 లోక్ సభ ఎన్నికల ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది. లోక్ సభతో పాటు ఆంధ్ర ప్రదేశ, ఒడిషా రాష్ట్రాల్లోని శాసన సభ ఫలితాలు కూడా అపుడే వెల్లడించనున్నారు.

## విడుదలైన పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్ష ఫలితాలు

### స్ట్రీం లవారీగా ర్యాంకుల ప్రకటన

### జులై 7 నుంచి రెండో విడత కౌన్సెలింగ్

హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం (జూన్ 3న) మధ్యాహ్నం 12 గంటలకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం పాలిసెట్ ఫలితాలను విడుదల చేశారు. అధికారిక వెబ్సైట్లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబరు, ఫోన్ నెంబరు, హాల్టికెట్ నెంబరు, పాస్వర్డ్ వివరాలు నమోదుచేసి ర్యాంకు కార్డులు డౌన్లోడ్ చేసుకోవచ్చు. పాలిసెట్ పరీక్ష ఫలితాల్లో మొత్తం 84.20 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 69,728 మంది అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 84.20 శాతం, ఎమ్ బైపీసీలో 82.48 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పాలిసెట్ పరీక్షకు 46,319 మంది బాలురు హాజరుకాగా.. 37,269 మంది (80.47 శాతం) అర్హత సాధించారు. ఇక 36,496 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా.. 32,459 మంది (88.94 శాతం) అర్హత సాధించారు.

**స్ట్రీం లవారీగా ర్యాంకుల ప్రకటన**

పాలిసెట్ ఫలితాలకు సంబంధించి ప్రతి అభ్యర్థికి రెండు వేర్వేరు ర్యాంకులను తయారు చేస్తారు. టెక్నికల్ పాలిటెక్నిక్, అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ డిప్లొమాగా ర్యాంకుల జాబితాను రూపొందించి, కౌన్సెలింగ్ ద్వారా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

**జూన్ 30 నుంచి పాలిసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లి**

ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జూన్ 20 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు జూన్ 20 నుంచి 24 వరకు రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. వీరికి జూన్ 22 నుంచి 25 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినవారు జూన్ 22 నుంచి 27 మధ్య వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. ఆప్షన్ల నమోదు ప్రక్రియ పూర్తిచేసివారికి జూన్ 30న సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందినవారు జూన్ 30 నుంచి జులై 4 మధ్య సంబంధిత కళాశాలల్లో నిర్ణీత ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

**జులై 7 నుంచి రెండో విడత కౌన్సెలింగ్**

మొదటి విడత కౌన్సెలింగ్లో సీట్లు పొందలేకపోయినవారు, కౌన్సెలింగ్లో పాల్గొనలేకపోయినవారికి జులై 7 నుంచి 16 మధ్య రెండో విడత పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీరికి జులై 9 నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. ఆప్షన్లు నమోదుచేసుకున్నవారికి జులై 13న సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందినవారు జులై 16లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక కన్వీనర్ ద్వారా ఇంటర్నల్ స్లైడింగ్ చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. జులై 21 నుంచి ఇంటర్నల్ స్లైడింగ్ అవకాశం కల్పించనున్నారు. జులై 24లోపు సీట్లను కేటాయించి జులై 23న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలను విడుదల చేయనున్నారు.

## సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

### *సబ్ రిజిస్టర్ నుంచి 99,200 స్వాధీనం*

### మొత్తం ఫైళ్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు



సూర్యాపేట, జూన్ 03 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ దాడులు నిర్వహించారు. ఇటీవల సబ్ రిజిస్టర్ సురేందర్ నాయక్ అక్రమ లేఔట్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు అందుకున్న ఏసిబి అధికారులు దాడులు జరిపారు. సొమ్ము ముట్ట చెప్పిన వారికి ఏ పనైనా అవలీలగా పూర్తి చేస్తున్న సబ్ రిజిస్టర్ పై సూర్యాపేటకు చెందిన మేక వెంకన్న అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. తన కూతురుకు ఇచ్చిన 800 గజాల స్థలం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు 4 నెలలుగా తిప్పుకుంటున్నారు. పెద్ద మొత్తంలో సొమ్ము డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. డాక్యుమెంట్ రైటర్ల ద్వారా డబ్బు తీసుకున్న రిజిస్ట్రార్ పని చేయకుండా కాలం గడుపుతూ ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. భాధితుడు మేక వెంకన్న నుంచి 90 వేల రూపాయలను డాక్యుమెంట్ రైటర్లు కల్లురు శ్రీనివాస్, తంగేళ్ల వెంకట రెడ్డి తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు డాక్యుమెంట్ రైటర్లు కల్లూరి శ్రీనివాసు, తంగెళ్ల వెంకట రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కార్యలయంలోని మొత్తం ఫైళ్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు వాటిపై సమగ్ర విచారణ తర్వాత సబ్ రిజిస్టర్ నుంచి 99,200 స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు సబ రిజిస్టర్ సుందర్ నాయక్, కొల్లూరు శ్రీనివాస్ రెడ్డి, తంగెళ్ల వెంకటరెడ్డి లను అదుపులోకి తీసుకున్నారు.

## యాదాద్రి దేవస్థానంలో స్థానికులకు ఉచిత దర్శన సదుపాయం

యాదగిరిగుట్ట, జూన్ 03 (తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి భక్తులకు శుభవార్త చెప్పారు ఆలయ ట్రస్ట్ అధికారులు. ఆలయంలో ప్రతి మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి 5.30 గంటల వరకు ఉచితంగా స్థానికులకు దర్శన సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక చిరునామా, ఐడీ ప్రూఫ్, సాంప్రదాయ దుస్తులతో వచ్చే స్థానికులకు మాత్రమే గర్భాలయ దర్శనం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఆలయ ఈవో భాస్కర్ రావు సోమవారం అధికారిక ప్రకటన చేశారు. ఈవో భాస్కర్ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు యాదాద్రిలో నిత్య అన్నదాన సదు-పాయాన్ని ఆదివారం నుంచి 1000 మంది భక్తులకు కల్పిస్తున్నట్లు ఈవో వెల్లడించారు. ఇప్పటి వరకు 600 మంది భక్తులకు నిత్యాన్న ప్రసాదం కల్పిస్తున్నామని ఇక నుంచి మరో 400 మందికి అన్నప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ఇక ఆదివారం ఏకాదశిని పురస్కరించుకుని 4,600 మంది భక్తులు తలనీలాలు సమర్పించారని చెప్పారు. తలనీలాల ద్వారా రూ.2,30,000 ఆదాయం సమకూరిందని వెల్లడించారు.

## జూన్ 18న యూజీసీ నెట్ పరీక్ష

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించనున్నట్లు వెల్లడించింది. పరీక్షకు 10 రోజుల ముందు అడ్మిట్ కార్డులు విడుదల చేయనున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. మొత్తం 83 సబ్జెక్టులకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష (పెన్/పేపర్)ను ఆఫ్‌లైన్ విధానంలో దేశ వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించనున్నారు. రెండు షిఫ్టుల్లో పరీక్ష ఉంటుంది. 42 సబ్జెక్టులకు ఉదయం సెషన్‌లో పరీక్ష ఉంటుంది. మిగిలిన 41 సబ్జెక్టులకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష ఉంటుంది. ఉదయం సెషన్ 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. కాగా ఏటా ఈ పరీక్షను రెండు సార్లు నిర్వహిస్తుంటారు. ఓఎమ్మార్ పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. పేపర్ 2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష మొత్తం 3 గంటల వ్యవధి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు. జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, యూనివర్సిటీలు, అనుబంధ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ సర్టిఫికెట్ ఉపయోగపడుతుంది.

## రాష్ట్ర చిహ్నంలో మార్పులపై స్పందించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయం స్టేట్ పాలిటిక్స్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. స్టేట్ అఫిషియల్ లోగోలో ప్రస్తుతం ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించాలనుకుంటున్న ప్రభుత్వం నిర్ణయంపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ భగ్గుమంటుంది. కాంగ్రెస్ సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు సైతం చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ఎంబ్లమ్‌లో చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించొద్దని డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులపై మంత్రి సీతక్క స్పందించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో కాకతీయ కళాతోరణం తొలగింపుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలోని మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకముందే విపక్షాలు అప్పుడే ఆందోళన చేయడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు రాష్ట్రం గీతాన్ని కూడా వివాదస్పదం చేయడం తగదని చురకలంటించారు. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు గెలుస్తోందన్న విశ్వాసం ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు.

## హిస్టరీ టూరిజం నూతన విభాగధిపతిని సన్మానించిన విద్యార్థులు

### కార్యక్రమంలో పాల్గొన్న క్లాస్ కోఆర్డినేటర్స్



హన్మకొండ కెయూ, జూన్ 03 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ టూరిజం విభాగంలో నూతనంగా విభాగధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. చిలివేరు రాజకుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టడం జరిగింది. కాగా సోమవారం విభాగంలో వారిని టూరిజం ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు (క్లాస్ కోఆర్డినేటర్స్) రెడ్డి ప్రశాంత్, భూక్యా రమేష్, మరియు మహ్మద్ షాజాబ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియచేయడం జరిగింది. అనంతరం నూతన విభాగాదిపతిని సన్మానించడం జరిగింది.

## జూన్ 17, 25న సెలవు దినంగా ప్రకటించిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం జూన్ 17, 25 న సెలవు ప్రకటించింది. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండగకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయితే బక్రీద్ ఎప్పుడు జరుపుకుంటే అప్పుడు సెలవు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. 17వ తేదీన జరుపుకుంటే ఆ రోజు లేదా 18న జరుపుకుంటే ఆ రోజు సెలవు ఇస్తారు. బక్రీద్ ఘనంగా జరుపుకోవడానికి ముస్లిం సోదరులు సిద్ధమయ్యారు. బక్రీద్ తో పాటు జూన్ 25వ తేదీన వచ్చే ఈద్-ఎ-గదీర్‌కు తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్‌లో 12వ నెల అయిన దుల్ హిజ్జా 10వ తేదీన బక్రీద్ జరుపుకుంటారని చెబుతున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం

దేశంలో పార్లమెంటు ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. జూన్ 4 సాయంత్రానికి 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలూ వెల్లడి కానున్నాయి. ఈ క్రమంలో ఈ ఎన్నికల్లో పార్లమెంటులో మళ్ళీ అధిక సంఖ్యలో స్థానాలను గెలుచుకొని వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తామని కమలనాథులు చెప్పుకొస్తున్నారు. సుమారు రెండు నెలల పాటు సాగిన ఈ ఎన్నికల ప్రచారంలో గత పదేళ్లుగా దేశాన్ని పాలించిన ప్రధాని, ఆయన మంత్రివర్గ సహచరులు, సదరు పార్టీ నేతలంతా భావోద్వేగాలకు సంబంధించిన అంశాలనే ప్రచారం చేశారు తప్ప, దేశంలో నానాటికీ పెరిగిపోతున్న ఆహార ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, ఆహార లభ్యత వంటి కీలక అంశాలను ఎక్కడా చర్చించేందుకు సాహసించలేకపోయారు.టోకు ధర సూచిక (హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్) ప్రకారం.. ఆహార పదార్థాల ధరలు 2024 మార్చిలో 6.88 శాతం ఉండగా ఏప్రిల్‌కి వచ్చేసరికి అది 8.7 శాతానికి పెరిగింది. నిరుడు ఇదే కాలంతో పోల్చితే 18 బేసిస్ పాయింట్లు, నెలవారీ రేటు ప్రాతిపదికన గత నెలతో పోలిస్తే 0.74 శాతం పెరుగుదల నమోదైంది. 2024 జనవరి నుంచి ఈ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే మొదటి సారి. ఏప్రిల్ నెలలో దేశమంతా నెలకొన్న విపరీతమైన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల ప్రభావం, మే నెలలోనూ ఇదే వాతావరణం నెలకొనటంతో గోధుమలు, కూరగాయలు, పండ్లు, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తుల ధరలు పెరుగుతూ పోతున్నాయి. ఋ?తుపవనాలు సకాలంలో వచ్చి, తగినంత వర్షపాతం నమోదైతే తప్ప.. ఆహార ద్రవ్యోల్బణం తగ్గే సూచనలు కనిపించటం లేదు. ఎన్డీయే సర్కారు 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆహార వస్తువుల ధరలు పైపైకే చూస్తున్నాయి. 2023 నవంబర్‌లో తొలిసారి ఆహార ద్రవ్యోల్బణం 8శాతం దాటింది. అప్పటి నుండి ఇంకా పైపైకే దూసుకుపోయింది తప్ప ఏ దశలోనూ కిందికి దిగలేదు.నానాటికీ పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం ప్రభావం నగర, పట్టణ ప్రాంతాల ప్రజల కంటే గ్రామీణ ప్రాంతాల వారి మీద ఎక్కువగా ఉంటోంది. ఏప్రిల్ నెలలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల ద్రవ్యోల్బణం 5.43 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 4.11 శాతంగా నమోదైంది. నిరుటితో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ఆహారధాన్యాల ధరలు 8.75 శాతం పెరగగా, పట్టణ ప్రాంతాల్లో 8.56 శాతం మేర పెరిగాయి. ఈ పదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో ఏటికేడు గ్రామీణ ప్రాంతాల మీద ఆర్థికపరమైన ఒత్తిడి కొనసాగుతూనే వస్తోంది. 2024 మార్చితో పోల్చితే ఏప్రిల్ నాటికి తృణధాన్యాల ధరలు 8.63 శాతం, పండ్లు 5.22 శాతం, నూనెలు 9.43 శాతం, మాంసం-చేపల ధరలు 8.17 శాతం మేర పెరిగాయి. కూరగాయలు, వంటనూనెల ధరలు వరుసగా రెండు నెలల్లోనూ (మార్చి, ఏప్రిల్) 27.8, 16.8 శాతం మేర పెరగడంతో ఆదాయాలు స్వల్పంగా పెరిగినా సామాన్యుడి జేబుకి చిల్లుపడుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ , ధరల పర్యవేక్షణ విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం నిరుటి మే నెలతో పోల్చితే ఈ ఏడాది మే నెలలలో బియ్యం ధరలు సగటున 14.3 శాతం, గోధుమల ధరలు 6.4 శాతం పెరిగాయి. తృణధాన్యాల ధరలు ఏ మాత్రం తగ్గే అవకాశమే కనిపించటం లేదు. కూరగాయలు, నూనెల ధరలు రెండంకెల స్థాయిలో పెరిగిపోయాయి. మరోవైపు హోల్‌సేల్ ధరల సూచి కూడా పైపైకే పోతోంది. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26 శాతానికి పెరిగింది. వాణిజ్య మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం గత 13 నెలల్లో ఇదే అత్యధికం కావటం గమనార్హం.మరోవైపు దేశంలో రైతుల చేతిలో వున్న ఆహారోత్పత్తి వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాల పేరుతో పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేసింది. దేశవ్యాప్తంగా దీనిపై తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావటంతో ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నారు. రైతు ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పించి తీరవలసిన పరిస్థితిని సృష్టించే ప్రత్యేక చట్టాన్ని తీసుకు వస్తామని ప్రధాని చేసిన వాగ్దానం నీటిమూటగానే మిగిలిపోయింది. మరోవైపు.. ద్రవ్యోల్బణాన్ని 2 నుంచి 6 శాతానికి మించకుండా చూస్తానని ఆర్‌బిఐ చెప్పుకొన్నా అదీ ఆచరణలోకి రాలేదు. 2023 ద్వితీయార్థంలో ప్రభుత్వం కొన్ని ఆహార సరకుల ఎగుమతులను నిలిపివేయటం ద్వారా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలని చూసింది. ఈ క్రమంలో అదే ఏడాది జులై లో నాన్ బాస్మతి బియ్యం ఎగుమతిని నిషేధించింది. తద్వారా దేశంలో బియ్యం ధరలు తగ్గుతాయని ఆశించింది. కానీ, అలాంటిదేమీ జరగకపోగా, బియ్యం ధరలు మరింత పెరిగాయి. దేశీయంగా ఉన్న ఆహార ధాన్యాల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయటపోవటం, నల్లబజారులో నిల్వలు పెరిగిపోవటం, కృత్రిమ కొరత సృష్టించే మాఫియాల ప్రభావమే దీనికి కారణమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలా.. ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతే, ఆకలి, పోషకాహార లోపం వంటి సమస్యలు మరింత పెరుగుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఈ ఆందోళనకరమైన ఆర్థిక గణాంకాలేవీ ఈ ఎన్నికల సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చోటు సంపాదించలేకపోవటం విచారకరం. జూన్ 4న పాత తీర్పు వస్తుందో లేక మార్పు గాలి వీస్తుందో పక్కనబెడితే, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును మాత్రం ఇకనైనా సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

# ఘనంగా సిపిఐ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం

**- పతాకాన్ని ఆవిష్కరించిన మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి**



నేరేడుచర్ల, జూన్ 03(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల లోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ ముందు జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు ) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పతాకాన్ని జాతీయ మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి ఆవిష్కరించిన అనంతరం ఆమె ప్రసంగిస్తూ భారతదేశంలో మహిళల కోసం ఒక సంఘం ఉండాలని ఆనాటి ప్రముఖ మహిళా కమ్యూనిస్టు యోధులు స్థాపించిన సంఘమే ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్) అని ఆ సంఘానికి అనుబంధంగా తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించామని భారతదేశంలో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ఘన చరిత్ర మహిళా సమాఖ్యదే నని సిపిఐ పార్లమెంటు సభ్యురాలు గీతా ముఖర్జీ పార్లమెంటులో మహిళా సమాఖ్య బిల్లు ప్రవేశపెట్టారని ఆమె గుర్తు చేశారు. తెలంగాణలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని, భవిష్యత్తులో కూడా మహిళలు ఎదుర్కొనే అన్ని సమస్యలపై ముందుండి పోరాటం చేస్తామని, మహిళలకు మహాలక్ష్మి పథకాల కింద ప్రతి నెల 2500 రూపాయలు ఇస్తామని ఎన్నికల నాటి వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని ఆమె కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఇండ్లులేని మహిళలను గుర్తించి ఇండ్ల స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి కేటాయించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బాలికల గురుకుల పాఠశాలకు బాలికల కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ఆశ అంగన్వాడి లలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, సైదమ్మ అరుణ, ఆశాబేగం, ఇటుల లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

**- పెద్ద కూతురు సర్జరీ కి 20లక్షలు ఖర్చు అవుతుందంటున్న వైద్యులు**

**- దాతలు ఆదుకోవాలని ప్రాధేయపడుతున్న కుటుంబ సభ్యులు**





గరిడేపల్లి, జూన్ 03(తీన్మార్ న్యూస్): ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి, పెద్ద కూతురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ఉండడం తో దిక్కుతోచని స్థితిలో పడ్డామని ఇంటి ఇల్లాలు కన్నీటి పర్యంతం అవుతున్న సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో పలువురుని కంట తడి పెట్టిస్తుంది. వివరాల్లోకి వెళితే వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర సైదులు తనకున్న కొద్ది పాటి వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. గత సంవత్సరం వర్షాలు లేక పంటలు పడకపోవడంతో జీవనోపాధి కోసం మఠంపల్లి మండలం, చౌటపల్లి గ్రామంలో ఉంటూ ఓ సిమెంట్ కర్మాగారంలో పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కష్టం చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కుర్ర సైదులు వారం క్రితం తమ గ్రామంలో యాదవులు జరుపుకునే గంగమ్మ జాతర కు వచ్చి తిరిగి చౌటపల్లి వెళ్లే క్రమంలో హుజూర్ నగర్ మండల పరిధిలోని గోపాల పురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మరణించగా, అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సౌమిక ఆస్పత్రిలో ఉంది. సౌమిక కు 5రకాల సర్జరీ లు చేయాలని, ఆయా సర్జరీ లకు దాదాపు 20 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ఇంటి ఇల్లాలు కుర్ర రమాదేవి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. ప్రస్తుతం తమ ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉందని, రూ. 20 లక్షలు పెట్టి బాగు చేయించుకునే స్థితిలో లేమని, ఎవరైనా మనసున్న మారాజులు సాయం చేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని దాతలను వేడుకుంటుంది. దయచేసి ఎవరైనా దాతలు ఉంటే తమకు తోచిన సహాయాన్ని అందించి ఒక ప్రాణాన్ని, ఓ కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేయాలని, సాయం చేసే మనసున్న దాతలు నేరుగా కానీ, తన మేనమామ సంద్రాల రవి 9966558739 గూగుల్/ ఫోన్ పే నంబర్ కు తోచిన సహాయం అందించాలని స్థానికులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

# అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు

**- సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్**



వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): పిల్లలలోని అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు బస్ లింగయ్య అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ (హెచ్ఎం)అన్నారు. గత నెల రోజులుగా వనపర్తి పట్టణంలో పిల్లలకు చిత్రకళలో శిక్షణ నిస్తున్న ప్రముఖ చిత్రకారుడు బస్ లింగయ్య క్యాంప్ ను సాహితీ కళా వేదిక సభ్యులు సోమవారం సందర్శించారు. దాదాపు ముప్పై మంది విద్యార్థులు ఈ వేసవి సెలవులలో ఆయనతో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతూ అందులో నైపుణ్యాన్ని సాధిస్తున్నారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ కేవలం చదువే పరమావధిగా భావిస్తున్న తరుణంలో పిల్లల్లోని ఆసక్తిని గమనించి, వారిని ఆ రంగంలో ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. కళలు మానసిక ఆనందం తో పాటు, ఏకాగ్రతను పెంపొందిస్తాయని పి. శంకర్ గౌడ్ తెలిపారు. 36సంవత్సరాలు డ్రాయింగ్ మాష్టర్ గా పనిచేసి రిటైర్ అయిన బస్ లింగయ్య తన తీరిక సమయంలో కళల పట్ల పిల్లలకు అభిరుచిని కలిగించడం ప్రశంసనీయమని అన్నారు. కళావేదిక ప్రతినిధులు ఆయనను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల, బైరోజు చంద్ర శేఖర్, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, బోజ్జి బాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**- 31 సంవత్సరాల తరువాత మొదటిసారి కలిసిన బాల్య మిత్రులు**

**- యోగాక్షేమాలు తెలుసుకుని ఆత్మీయతను పంచుకుని ఆనందంగా గడిపిన స్నేహితులు**

**- ఇక నుంచి బాల్య మిత్రుల కష్టసుఖాల్లో అండగా ఉంటామని ప్రతిజ్ఞ**





వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): 1992-93 సంవత్సరంలో పెద్దమందడి జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత మొదటిసారిగా వారు విద్యనభ్యసించిన పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 10వ తరగతి పూర్తయిన అనంతరం పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారందరూ కూడా ఒక వేదికపైకి ఆదివారం చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. బాల్య మిత్రులందరూ ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. ఇక నుండి బాల్య మిత్రుల కష్టసుఖాల్లో భాగస్వాములై స్నేహితులకు అండగా నిలవాలని తీర్మానించుకున్నారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శివరాజ లింగం, ఎన్. కృష్ణయ్య, సత్యనారాయణ శెట్టి లను ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించి వారి ఆశీస్సులను తీసుకున్నారు. 1992-23 సంవత్సరంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు చిన్నమందడి రాంరెడ్డి సార్ కృషితో పెద్దమందడి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేయించారని వారు గుర్తు చేసుకున్నారు. 10వ తరగతి పూర్తయిన అనంతరం మృతి చెందిన ఉపాధ్యాయులు బాల్య మిత్రులు ఆత్మ శాంతికి 2నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమాన్ని ముందుండి విజయవంతం చేసిన పూర్వపు విద్యార్థులు జివిస్ గోపాల్ యాదవ్, కావలి విష్ణు, రాధాకృష్ణ, బొందల కృష్ణయ్య యాదవ్ లను బాల్య మిత్రులు ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సూర ప్రభాకర్, జి. రాములు, దత్తుల్‌రెడ్డి, అశోక్ గౌడ్, సలీమ్, టి. కురుమయ్య, విజయ్, రామకృష్ణ, జంగం రమేష్, మహేష్, సుజాత, కవిత, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, జహేదర్ బేగం, నాగలక్ష్మి, ప్రవీణ, తదితరులు ఉన్నారు.

# కరాటే బ్లాక్, కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో ప్రతిభ చూపిన విద్యార్దులు



**- విద్యార్థులు బెల్ట్ సర్టిఫికెట్ల అందించి అభినందించిన కరాటే పేరెంట్స్ కమిటీ సభ్యులు**

వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నంత పాఠశాల ఆధ్వర్యంలో గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ మరియు కలర్ బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో బ్లాక్ బెల్టు 10 , మరియు కలర్ బెల్ట్ 20 విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. అని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ విద్యార్థులందరినీ కరాటే పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్ల అందిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. ఈ మెగా కార్యక్రమంలో క్లబ్బు డిప్యూటీ ఫౌండర్స్ జి హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్ బాబా, అజ్మీర్, లాస్య, కార్తికేయ యాదవ్, ఎస్కే గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్టీ కమిషన్ నెంబర్ హుస్సేన్ నాయక్ ను కలిసిన భూక్య సంతోష్ నాయక్



యాదాద్రి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): లంబాడి హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ సోమవారం జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాల పై చర్చించారు. తండాల అభివృద్ధి, గిరిజన 10 శాతం రిజర్వేషన్ బిల్లును, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు భారతదేశంలో ఒకే కులము ఒకే భాష మాట్లాడే బంజారాలను, బంజారా భాషను గోర్ బోలీ నీ 8వ షెడ్యూల్లో చేర్చాలని, అలాగే ఎస్టీల సమస్యలపై చర్చించారు

# ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన



వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లంగర్ హౌస్ కు చెందిన స్వాతి ప్రైవేట్ సంస్థలో హౌస్ కీపింగ్ గా యువకుడు శ్రీను ఎలక్ట్రీషన్ గా పనిచేస్తున్నారు. రెండేళ్లగా ఇద్దరు ప్రేమించుకున్నారు. మహబూబ్నగర్ జిల్లా, అడ్డాకుల మండలం, రామచంద్రపురం గ్రామం చెందిన శ్రీను మరో యువతి తో నిశ్చితార్థం చేసుకున్నారని తెలిసి పోయిన శుక్రవారం నుండి యువతి, యువకుని ఇంటి ముందర ఆందోళనకు దిగింది. యువతి స్వాతి సోమవారం పత్రిక ముఖంగా మాట్లాడుతూ తనకు న్యాయం చేయాలని అతనితో పెళ్లి చేయాలని యువకుని ఇంటి ముందర భీష్మించుకుని కూర్చున్నది.

# కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్: ఓట్ల లెక్కింపు కోసం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించారు. సెకండ్ రాండమైజేషన్ ప్రక్రియ కరీంనగర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకులు అధికారి అమిత్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు జీ నజ్మా పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ఓట్ల లెక్కింపుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డిఓ కే. మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# పాలిసెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానం

**– ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి**

వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి ఈరోజు ప్రకటించిన పాలిసెట్ ఫలితాలలో వనపర్తి పట్టణం లో విజ్ డమ్ అకాడమీకి చెందిన విద్యార్థులు రాష్ట్రంలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం జరిగింది. ప్రిటిన్ ప్రణవ్ 110/120 స్టేట్ ర్యాంక్314 ,అభిరామ్ 104/120 స్టేట్ ర్యాంక్ 712 , సాయి భరత్ 102/120 స్టేట్ ర్యాంక్ 991.విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి అభినందించి, శాలువలు కప్పి సన్మానించారి. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ మంచి చదువులు చదివి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని. అత్యున్నతమైన జాబులల్లో సెటిల్ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి



జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, భాస్కర్, రాగి వేణు, అబ్దుల్లా, విజ్ డమ్ అకాడమీ ఉపాధ్యాయులు. పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట లో ప్రాజెక్ట్ మీటింగ్ ఏర్పాటు

**– హాజరైన జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి**





భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 03తీన్మార్ న్యూస్): రామన్నపేట మండల కేంద్రంలో ప్రాజెక్టు మీటింగ్ సిడిపిఓ శాగంటి శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిదిగా జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ వేసవి సెలవులు ముగించుకొని విధులలో చేరిన అంగన్వాడీ టీచర్లు పిల్లలకు సరైన పోషకాహారం అందించాలని లోప పోషనలేని అంగన్వాడీ సెంటర్లు చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ సెంటర్లకు సప్లయ్ చేసిన గ్రోత్ మిషన్స్ తో సరైన బరువులు కొలతలు చూసి వారి స్థితిని తల్లి తండ్రులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైసర్స్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ మరియు అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సోనియాగాంధీ పై అనుచిత వాక్యాలను ఖండించిన జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్

వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర మించిన సోనియా గాంధీ ని ముఖ్య అతిథిగా రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించడాన్ని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సోనియా గాంధీ ని రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏ విధంగా పిలుస్తారని వ్యంగంగా మాట్లాడారు. సోనియా గాంధీని జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆహ్వానిస్తే, ఆ పిలుపును తప్పు పడుతూ దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన బ్రిటన్ రాణీని కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పిలవాలని బ్రిటన్ రాణీతో సోనియా గాంధీని పోల్చడం మాజీ మంత్రి అవివేకానికి నిదర్శనమని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజానీకానికివెంటనే క్షమాపణ చెప్పకుంటే మాజీ మంత్రి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇకముందు ప్రభుత్వంపై కానీ కాంగ్రెస్ నాయకుల పైన కానీ అనుచిత వాక్యాలు చేస్తే బిఆర్ఎస్ నాయకుల ఇండ్ల ముట్టడి జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్రం స్థాయిలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అడ్డుకుంటారని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సోనియా గాంధీ కృషి వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందంటూ ప్రసంగించడం నిజమే కదా, ఆ శాసనసభలో ఉన్న నీవు ఆ వాక్యాలు తప్పు అని ఎందుకు ఖండించలేదు నిరంజన్ రెడ్డి, సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది అనేదినిజం కాబట్టే ఆరోజు చట్టసభలో నీవు సైలెంట్ గా ఉన్నావ్ సోనియా గాంధీ కి రెండు పర్యాలు ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిన ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్ ని ప్రధానమంత్రిని చేశారు. కానీ ఆమె కాలేదు అని అన్నారు. మలి విడత ఉద్యమం, తొలివిడత ఉద్యమం, ఆలు పెరగని ఉద్యమాలు, అలసిపోని పోరాటాలు, ఎంతో మంది ఆత్మబలి



దానాలు, ప్రాణ త్యాగాల ఫలితంగా, సోనియాగాంధీ ఉక్కు నిర్ణయం ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, నిన్న జరిగిన ఉప ఎన్నికల ఫలితాలలో బిఆర్ఎస్ పార్టీ విజయం సబ్బలు జరుసుకుంటున్నారు. కానీ గతంలో ఉన్న సిట్టింగ్ స్థానాన్ని మాత్రమే కైవసం చేసుకుంది అని అన్నారు. 2018లో బిఆర్ఎస్ పార్టీకి 1000 మందికి పైగా ప్రజా ప్రతినిధులు ఉన్నారు కాంగ్రెస్ పార్టీకి రెండు వందల మందికి పైగా ప్రజాప్రతినిధులు మాత్రమే ఉన్నారు. అలాంటిది నిన్న ఫలితాలలో కాంగ్రెస్ పార్టీకి 650 పైగా ఓట్లు రావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ గతం కన్నా ఎక్కువ ఓట్లు రాబట్టి పుంజుకుంది నైతిక గెలుపు కాంగ్రెస్ పార్టీది అనిగుర్తు చేశారు. ప్రెస్ మీట్ లో పాల్గొన్న నాయకులు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, వనపర్తి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, వనపర్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. కృష్ణ, వనపర్తి జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు, అనీష్, రమేష్, రామరాజు, పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, గోపాల్ పేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ సాయి లో డాక్టర్ బూర.. పలువురికి పరామర్శ

హైదరాబాద్, జూన్ 03(తీన్మార్ న్యూస్): నాగోల్ లోని పవన్ సాయి హాస్పిటల్ లో నకిరేకల్, చేవాళ్ళ మరియు ఆలేరు కు చెందిన పలువురుకి వేరువేరుగా ప్రమాదవశాత్తూ గాయాలైన సందర్భంగా ఆదివారం వారిని భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పరామర్శించి, వారి యొక్క ఆరోగ్య పరిస్థితి ఇలా ఉందని ఆస్పత్రి ఎండి డాక్టర్ అలేటి శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నకిరేకల్ పట్టణానికి చెందిన కొండ సైదులు అనే వ్యక్తి తడి చెట్టు పైనుండి జారీ పడిన సందర్భంగా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నా ఆయనను భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం సకాలంలో







ఎంతో మంది కి మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తున్నా, పవన్ సాయి ఆసుపత్రి వైద్యులను అభినందించారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి భరోసా

**– ఇచ్చిన ఎమ్మెల్యే గౌరవ తూడి మేఘా రెడ్డి**

వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి పట్టణంలో 5 వ వార్డుకు చెందిన గంధం కురుమయ్య సోమవారం మరణించదరు, ఇట్టి విషయాన్ని కందికోట శ్రీను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి సమాచారం ఇవ్వగా, వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కౌన్సిలర్ బివెంకటేశ్వర్లు, చంద్రకళ, ఎల్ఐసి కృష్ణ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ ,శివ, శశి, జి.రాజు ,ఏ రమేష్, ఎం గోవిందు, శశాంక్ సాగర్, సురేష్ అందరు కలిసి మరణించిన గంధం కుర్మయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



# రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయనున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు శివసేన రెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూన్ 03(తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నాంపల్లి దగ్గరలోని ఎల్బీ స్టేడియంలో జూన్ 10వ తారీకు యూత్ కాంగ్రెస్ నాయకుడు శివసేన రెడ్డి గారు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మున్నూరు జయాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ ముఖ్య కార్యదర్శి యాదగిరి గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నరేష్ కుమార్ రెడ్డి, పెద్దమందడి మండల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎన్. కృష్ణ యాదవ్, తెలిపారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ యువత భవిష్యత్తు కొరకై ఎంతగానో పోరాడుతూ కృషి చేస్తున్న శివసేన రెడ్డి ప్రమాణ స్వీకారానికై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున యువకులు పాల్గొని



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# భూపాలపల్లిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా

**గండ్ర సత్యనారాయణ అంటే ఏంటో చూపిస్తా**

భూపాలపల్లి, జూన్ 03 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ సోమవారం ఓ ప్రకటన ద్వారా మాట్లాడుతూ గత పాలకులు బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజులలోపే గ్రామ గ్రామాన సిసి రోడ్లు డ్రైనేజీలు, అతివృష్టితో తెగిన చెరువు కట్టలు మరమ్మత్తులు వరదలతో కొట్టుకుపోయిన పాడి పశువులను సంబంధిత బాధితులకు ఇప్పించ డం, వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన నూతన గ్రామపంచాయతీ బిల్డింగుల శంకుస్థాపన, ఇలా చెప్పుకుంటూ పోతే ఇప్పటికే వేలకోట్ల రూపాయల అభివృద్ధి చేయడం జరిగింద న్నారు. ఇంకా వికలాంగుల సంక్షేమం కోసం, నిరుపేదల సంక్షేమం



కోసం అనేక ప్రభుత్వ పథకాలను అన్ని నియోజకవర్గాల కంటే భూపాలపల్లి నియోజకవర్గానికి ఎక్కువ నిధులు తెచ్చి ఎన్నడు జరగని అభివృద్ధిని చేసి చూపె డతానన్నారు. అన్యాయం అక్రమాలు భూకబ్జాలు విషయంలో ఇప్పటికే అధికారులతో మాట్లాడి భూకబ్జాలు చేసిన వారికి సహకరించిన వాళ్లు ఎంతటి వారైనా వదిలిపెట్టేదే లేదని తెలిపారు. గతంలో భూ కబ్జాలు చేసిన భూమిని మొత్తం అధికారులచే సర్వే చేయించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడానికి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతము ఎలక్షన్ కోడ్ కారణంగా అభివృద్ధి పనులను ఆపడం జరిగిందని ఎలక్షన్ కోడ్ తర్వాత మళ్లీ అభివృద్ధి పనులు వేగంగా మొదలు పెట్టడం జరుగుతుందన్నారు.

# దశదిన కర్మలకు రామకృష్ణ సేవా ట్రస్ట్ ఆర్థిక సహాయం

మంగపేట, జూన్ 03 (తీన్మార్ న్యూస్): మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీనర్సాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఈసం రామనాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని సోమవారం రోజున కన్నీరు మున్నీరు అవుతున్న వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి, ఐదు వేల రూపాయలు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాడిశ నవీన్, ఇందారపు రమేష్,మునిగెల మహేష్, కొమరం శివాజీ, మూయబోయిన శివ గ్రామ పెద్దలు కుర్సం విష్ణుమూర్తి, పుల్లయ్య,శ్రీను, సాంబయ్య, గ్రామ యువజన సభ్యులు కొమరం పుల్లారావు, కుర్సం నరేష్ , ప్రకాష్, రాఖేష్, రాంబాబు



తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం సాధనలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు వెలకట్టనిది

**అమరులైనకుటుంబాలకు అండగా ఉంటాం మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క**

హన్మకొండ, జూన్ 03 (తీన్మార్ న్యూస్): సోమవారం హన్మకొండ హంటర్ రోడ్డులో ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4 కోట్ల ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కు కృషి చేసిన శ్రీమతి సోనియా గాంధీకి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతూ గడిచిన 10 యేండ్లలో ఉద్యమకారులను ఉ ద్యమకారుల కుటుంబాలను కలవని వాళ్ళు మాపైన అవకులు





చెవాకులు పెలుస్తున్నారని ప్రజా ప్రభుత్వంలో అమరుల కుటుంబాలను గుర్తించి ఉద్యమకారుల కు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడానికి మా ప్రభుత్వం కంకణం కట్టుకుంది అని తప్పకుండా ఇది అమలు చేసి తీరుతామని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేసినం ఇంకా అనేక సంక్షేమ పథకాలు చేపట్టబోతున్నం, ఈ ఏడాది కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. అనంతరం ప్రొపెసర్ కోదండ రామ్ తో పాటు అమరుడైన శ్రీకాంతిచారి తల్లీ శంకరమ్మను మరియు అమరుల కుటుంబాలను ఘనగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంఎల్ఏ, కార్పొరేషన్ చైర్మన్ లు జేఏసీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులుతో తదితరులు పాల్గొన్నారు.

# అదే రకంపై మక్కువ..!

– ఒకే కంపెనీ విత్తనాల కోసం రైతుల పట్టు
– అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపణ
– ఇతర రకాలపై అన్నదాతల్లో కనిపించని నమ్మకం
– అవగాహన కల్పించడంలోనూ అధికారుల వైఫల్యం




ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విత్తనాల సమస్య తీరడం లేదు. గత నాలుగు రోజులుగా విత్తనాల కోసం రైతులు బారులు తీరుతున్న వ్యవహారం రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య చిచ్చు రేపుతోంది. ఖరీఫ్ సీజన్ సమీపించడంతో విత్తనాల సమస్య సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. ఒకే కంపెనీకి సంబంధించిన విత్తనాలు కావాలని రైతులు పట్టుబట్టడం.. ఈ రకం విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం సమస్యగా మారుతోంది. జిల్లాకు సుమారు 2లక్షల ప్యాకెట్లు రాగా.. ఇప్పటికే చాలా వరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. ఈ రకం కంపెనీ విత్తనాలు తక్కువగా ఉండటంతో అదే అదనుగా భావిస్తున్న విత్తన దుకాణాలు రైతులు మక్కువ చూపిస్తున్న రకం విత్తనాలు రెండు బ్యాగులతో పాటు ఇతర రకాలు మరో నాలుగింటిని అంటగడుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క రైతులు కోరిన విత్తనాలకు డిమాండ్ పెరగడంతో కొందరు డీలర్లు అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తొలినాళ్లలో మహారాష్ట్ర రైతులకు వీటిని అధిక ధరలకు విక్రయించడం కూడా విత్తన కొరతకు కారణమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోపక్క ఇతర కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు కూడా ఉన్నా.. రైతులకు వాటిపై నమ్మకం లేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. ఎందుకంటే ఇటీవల జిల్లా కేంద్రంలో కొన్ని కంపెనీల పేరిట నకిలీ విత్తనాలు విక్రయించడం అవి అధికారులకు పట్టుబడటంతో రైతులు ఆందోళన చెందారు. ఏవి నకిలీవి..ఏవి నిజమైనవో తెలియని పరిస్థితిలో ఉన్న రైతులు వారు మక్కువ చూపించిన రకం విత్తనాలు మాత్రమే కావాలని పట్టుబట్టేందుకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది.

**అవగాహన లోపం..అధికారుల వైఫల్యం..!**

ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో ముందే అధికారులు ఆయా మేలు రకం విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంటుంది. ప్రత్యేకంగా జిల్లావ్యాప్తంగా క్లస్టర్ల వారీగా ఏఈఓలు కూడా అందుబాటులో ఉన్నారు. విత్తన కొనుగోలు కంటే ముందుగానే అధికారులు క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి రైతులకు ఆయా మేలు రకం విత్తనాలపై అవగాహన..చైతన్యం కల్పించి ఉంటే ఈ సమస్య రాకపోయేదనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రైతుల కోరిన విత్తనాలతో పాటు వివిధ కంపెనీలకు చెందిన మేలు రకాల విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ రైతులకు వాటిపై అవగాహన లేకపోవడం కారణంగా వాటి వైపు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడం..ఆయా కంపెనీల విత్తనాలపై రైతులకు నమ్మకం లేకపోవడం కారణంగా ఈ సమస్య ఉత్పన్నమైనట్లు తెలుస్తోంది. రైతులు అందోళన చేసే వరకు వ్యవసాయశాఖ అధికారులు ఏయే దుకాణాల్లో ఎన్ని విత్తన ప్యాకెట్లు ఉన్నాయో కూడా పేర్కొనలేదు. రైతులు విత్తనాల కోసం బారులు తీరడం.. తోపులాట వంటి సంఘటన జరగడంతో మేల్కొన్న అధికారులు ప్రాంతాలు, దుకాణాల వారీగా విత్తన ప్యాకెట్ల వివరాలను బహిర్గతం చేశారనే అభిప్రాయం ఉంది. తాజాగా జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించినట్లు తెలిసింది. రైతులు మక్కువ చూపిస్తున్న సంబంధిత విత్తన కంపెనీ అధికారులతో మాట్లాడి జిల్లాకు మరో 50వేల ప్యాకెట్లు అధనంగా పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

## ములుగులో పేలిన మందుపాతర.. వ్యక్తి మృతి



ములుగు: ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకున్నది. పోలీసుల కోసం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వాజేడు మండలం కొంగాల గుట్టపై కట్టెల కోసం ముగ్గురు వ్యక్తులు అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ఏసు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.
ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఏసు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడినవారిని అదే గ్రామానికి చెందిన రమేశ్, ఫకీర్‌గా గుర్తించారు. అయితే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.


## చిన్నారుల టాయ్స్, లంచ్ బాక్సుల్లో దాచి డ్రగ్స్ రవాణా..

ముంబై: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సుమారు రూ.కోటికిపైగా విలువైన డ్రగ్స్‌ను కస్టమ్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు.అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌తోపాటు కస్టమ్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో చిన్నారుల ఆట బొమ్మలు చాక్లెట్లు, లంచ్ బాక్స్‌లు, క్యాండీ విటమిన్ లల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ. 1.15 కోట్ల విలువైన డ్రగ్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి**

**ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**




ములుగు, జూన్ 03 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవిన్యూ శాఖకు సంబంధించినవి (02), ఉద్యోగాలకు సంబంధించినవి (03), పెండింగ్ బిల్లులకు సంబంధించినవి (04), ఇతర శాఖలకు సంబంధించినవి (4), మొత్తం (13) దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ,ఆర్డీవో సత్యపాల్ రెడ్డి లతో కలిసి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెరువ్వులు, కుంటలు, ప్రాజెక్ట్ ల మరమత్తులు నివేదికలు వాటి ప్రస్తుత నీటి నిలువ సామర్థ్యం , పూర్తి నీటి నిల్వ సామర్థ్యం తదితర వివరాలు వెంటనే నివేదిక సమర్పించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు పంపిణీ చేసే బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు వచ్చే మూడు నెలలకు సరిపోయే విధంగా డీలర్లు స్టాక్ నిల్వలు సిద్ధంగా ఉంచుకోనే విధంగా చూడాలని సంబంధిత అధికారులును ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పై వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉండాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓ శ్రీనివాస్ కుమార్, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, డి ఎం సివిల్ సప్లయి రాంపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి ఈ ఓ పాణిని, డి సి ఓ సర్దార్ సింగ్ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.3లక్షల లంచం.. ఏసీబీకి చిక్కిన కుషాయిగూడ సీఐ, ఎస్ఐ

కుషాయిగూడ : భూ వివాదంలో తలదూర్చి.. వక్రమార్గం పట్టిన కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు ఏసీబీ అధికారులకు చిక్కారు. మధ్యవర్తి ద్వారా డబ్బులు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వీరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన శుక్రవారం కుషాయిగూడ పరిధిలో చోటుచేసుకుంది. రంగారెడ్డి జోన్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ, చక్రిపురంలోని స్థల సరిహద్దు వివాదంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాడంటూ కాప్రా డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కుషాయిగూడకు చెందిన సింగిరెడ్డి భరత్‌రెడ్డి అనే వ్యక్తిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. దీనిపై కోర్టు ఆదేశాలతో పోలీసులు అతడికి నోటీసులు జారీ చేశారు.
ఈ క్రమంలోనే కుషాయిగూడకు చెందిన ఎల్.ఉపేందర్ అనే వ్యక్తి ఈ కేసులను కాంప్రమైజ్ చేసేందుకు పోలీసుల తరఫున మధ్యవర్తిత్వం వహించాడు. ఎస్‌ఐ షేక్ షఫీ ఆదేశాలతో సింగిరెడ్డి భరత్‌రెడ్డిని ఉపేందర్ ఆశ్రయించాడు. రూ.3 లక్షల ఇస్తే కేసులు లేకుండా చూస్తానంటూ భరత్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చాడు. తనపై భరత్‌రెడ్డికి నమ్మకం కుదరకపోవడంతో ఉపేందర్ నేరుగా ఎస్‌ఐ షఫీతో మాట్లాడించాడు. మరి ఇన్‌స్పెక్టర్ విషయం ఏమిటంటూ భరత్‌రెడ్డి ఎస్‌ఐని ప్రశ్నించడంతో.. ఇన్‌స్పెక్టర్ వీరస్వామితోనూ కలిపించి రూ.3 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు.

## వర్షకాల సీజనల్ సమస్యల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి: వానాకాలంలో జిల్లాలో సీజనల్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో వచ్చే సీజనల్ సమస్యల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, రాబోయే విపత్తులను ఎదుర్కునేందుకు మన గ్రామ పంచాయతీ లు, మున్సిపాలిటీలు సన్నద్ధం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో ఉన్న నాలాలను అధికారులు పూర్తిగా పరిశీలించాలని, నాలాలపై జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చూడాలని, నాలాలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే చెత్త , పిచ్చి మొక్కలను తొలగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వానాకా లంలో వచ్చే ఆకస్మిక వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని, లోతట్టు ప్రాంతాలను ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వానా కాలంలో కురిసే ప్రతివర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నూతనంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో 5 ఇంకుడు గుంతలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఇంకుడు గుంతలు, పెద్దపల్లి మున్సిపాలిటీలో 50 ఇంకుడు గుంతలు, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలో చెరో 25 ఇంకుడు గుంతల నిర్మాణం జూన్ 25 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

**శిక్షణ పూర్తయిన క్రీడాకారులకు మెమొంటోలు అందజేత**

**ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ఏటూరునాగారం, జూన్ 03 (తీన్మార్ న్యూస్): క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం డివైఎస్ఓ ఆధ్వర్యంలో ఏటూరునాగారం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉండే క్రీడాకారులను దృష్టిలో ఉంచుకొని ములుగు జిల్లాలో 10 వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామని వీటిలో మొత్తం 332 మంది క్రీడాకారులు శిక్షణను పూర్తి చేసుకున్నారని వారిలో 189 మంది బాలురు, 143 మంది బాలికలకు నెలరోజులపాటు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారని, శిక్షణ శిబిరాలలో మెలుకువలు నేర్చుకున్న క్రీడాకారులు రాష్ట్ర మరియు జాతీయస్థాయి క్రీడలలో ప్రతిభ కనబరుస్తున్నారని అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగే విధంగా ప్రయత్నించాలని మీ గ్రామానికి మీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం ఇంచార్జీ జిల్లా యువజన క్రీడా అధికారి తుల రవి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో వాలీబాల్, హ్యాండ్ బాల్, కబడ్డీ, టైక్వాండో, సైక్లింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, క్రికెట్ క్రీడాంశాలలో 10 వేసవి శిక్ష శిబిరాలను ఏర్పాటు చేశామని క్రీడాకారులకు శిక్షణ అందించడానికి 10 మంది శిక్షకులను నియమించామని ఈ శిక్షణ శిబిరాలలో మొత్తం జిల్లా వ్యాప్తంగా 332 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ తుల రవి, డిపిఆర్ ఓ రఫిక్ , ఎల్ డి ఎం రాజ్ కుమార్ హ్యాండ్ బాల్ కోచ్ పి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్ ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



వరంగల్, జూన్ 03 (తీన్మార్ న్యూస్): ప్రమాదవశాత్తూ గాయపడి వరంగల్ లో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న గీసుగొండ మండలం వంచనగిరి సొసైటీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు కొల్లూరి రవీందర్ ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## వాటర్ ట్యాంక్‌లో శవం, అదే నీళ్లను పదిరోజులుగా తాగుతున్న జనం



హైదరాబాద్ : నాగార్జునసాగర్ ఉదంతం మరువకముందే నల్లగొండలో మరో ఘోరం చోటు చేసుకుంది. నల్లగొండ మున్సిపాలిటీలోని 11 వార్డు పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకులో అనుమానాస్పద స్థితిలో మృతదేహంలభించడం స్థానికంగా కలకలం రేపింది.
వాటర్ ట్యాంకులో వాటర్ చెక్ చేయగా అందులో డెడ్ బాడీ ప్రత్యక్షమైంది. వెంటనే మున్సిపాలిటీ సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. డెడ్‌బాడీ హనుమాన్ నగర్‌కు చెందిన ఆవుల వంశీగా గుర్తించారు. అతడు పది రోజుల క్రితం నుంచి కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైయింది. అయితే అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడా అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, ఇదే నీళ్లను గత పది రోజులుగా మున్సిపాలిటీ ప్రజలు తాగుతున్నారు. కలుషిత నీటిని 10 రోజుల నుంచి వాడామని తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, కొద్ది రోజుల క్రితం నాగార్జునసాగర్‌లో ఎండల తాకిడితో.. దాహం తీర్చుకోవడానికి ఒకదాని వెంట ఒకటి మినీ ట్యాంకులోకి దిగిన కోతులు అందులోనే ప్రాణాలొదిలిన వైనం బయటపడిన విషయం తెలిసిందే.

# ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలి..

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి,: ప్రభుత్వ పాఠశాలలు ఆధునికతను సంతరించుకొని ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు చేపట్టిన మరమ్మత్తు పనులను సకాలంలో పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, ఎంపిడిఓతో కలిసి మహాదేవపూర్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనుల పురోగతిని పరిశీలించారు. ఎల్కేశ్వరం గ్రామంలోని ఎంపిపియస్ పాఠశాలలో 3.85 లక్షలు, మండల పరిషత్ పాఠశాలలో 3.94 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మతులను, బొమ్మాపూర్ గ్రామంలోని జెడ్పిహెచ్ యస్ పాఠశాలలో 4.55 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను, మదేవపూర్ కెజిబివి పాఠశాలలో 3.20 లక్షల రూపాయలతో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. కెజిబివిల్లో బాలికల రక్షణ కోసం చుట్టూ ప్రహరి గోడ నిర్మాణం ఆగష్టు 15 వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారు లను ఆదేశించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 20 వ తేదీ వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. చేపట్టిన మరమ్మత్తు పనులకు అదనపు నిధులు కొరకు ప్రతిపాదనలు అందచేయాలని అన్నారు. పాఠశాలల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ లేని పాఠశాలలు ఉండొద్దని అన్నారు. పాఠశాలలు పున:ప్రారంభానికి ముందు పూర్తిస్థాయిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని విఓలను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మహాదేవపూర్ ఎంపిడిఓ కార్యాలయంలో పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిని పనులు పూర్తిచేసే గడువును మండలంలోని ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, కాంట్రాక్టు పనులు చేపట్టిన వివోలతో సమీక్ష నిర్వహించారు. మహాదేవపూర్ మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలల్లో 3 జడ్పి హెచ్ యస్, ఒక కేజిబివి ఉండగా 26 పాఠశాలల్లో ఒక కోటి నాలుగు లక్షల రూపాయలతో మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగులో ఉన్న పనులను వేగవంతం చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వచ్చే ఆగస్టు15 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా పేరుపొందేలా పాఠశాలలను తయారు చేయాలని అన్నారు. పాఠశాలలు తనిఖీకి ఎప్పుడైనా సెంట్రల్ టీం వచ్చినా పిల్లలకు అన్ని వసతులను ఏర్పాటు చేశామని గర్వంగా చెప్పుకునేలా ఉండాలని కలెక్టర్ అన్నారు. అదనంగా పాఠశాలల్లో తరగతి గదులు గాని కిచెన్ షెడ్స్ కానీ ఇతరత్రా ఏ పని అయిన సెకండ్ ఫేస్ లో కవర్ చేస్తామని అన్నారు. అంతకుముందు రెండు పాఠశాలల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూలు యూనిఫామ్స్ ధరించి చిన్నారులు జిల్లా కలెక్టర్ కు పూలతో స్వాగతం పలికారు. డి ఆర్ డి ఓ నరేష్, డిఈఓ రాంకుమార్, తహసిల్దార్ ప్రహ్లద్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ డిఈ సాయిలు, ఏఈ రవీందర్ పాఠశాలల హెడ్ మాస్టర్లు, విఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపుకు.... సర్వం సన్నద్ధం

### హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఈ నెల 4న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి మీడియా విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జిఎం ఇంజనీరింగ్ కాలేజీలో నందికొట్కూరు, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గాలు, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు, ఫార్మసీ కాలేజీలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అనంతరం అరగంటకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు జారీ చేసిన పాసులు తీసుకొని గంట ముందు వచ్చేలా రెండు పర్యాయాలు సమావేశం నిర్వహించి తెలియజేశామన్నారు. మొదటి రాండ్మైజేషన్ పూర్తయిన కౌంటింగ్ సిబ్బందికి మొదటి ధపా శిక్షణ ఇచ్చామని, ఈనెల 3వ తేదీ రెండవ రాండ్మైజేషన్ పూర్తి చేసి వెంటనే రెండవ దఫా శిక్షణ ఇస్తామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి అసెంబ్లీ సెగ్మెంట్ కు ఒక కౌంటింగ్ హాలు, పార్లమెంటు సెగ్మెంట్ కు మరొక కౌంటింగ్ హాల్ చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మరొక కౌంటింగ్ హాల్ ను కూడా సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి హాల్ కు 14 టేబుల్ చొప్పున... రౌండ్ల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 74 టేబుళ్లు, పార్లమెంటుకు 75 టేబుళ్లు.... పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 21 టేబుళ్లు, పార్లమెంటుకు 17 టేబుళ్ల చొప్పున ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ఉత్కంఠ ఫలితాల వెల్లడి జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు.

# సెప్టెంబర్,అక్టోబర్ లో ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: ;సెప్టెంబర్,అక్టోబర్ లో ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ ప్రకటించ బోతున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం గాంధీ భవన్ లో పార్టీ నేత అద్దంకి దయాకర్ తో కలిసి మీడియా సమావేశం లో మాట్లాడారు.అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా గేయాన్ని జాతీయకి అంకితం చేయడమే ఎజెండా..మొదటి సారి ఉద్యమకారులే ఆహ్వానాలు అందించుకుని.. వారే ముఖ్యులుగా ఆవిర్భావ వేడుకలుజరుపుకుంటున్నాం.రాష్ట్రీయ గీతాన్ని మొదటి సారిగా ప్రకటించబోతున్నామన్నారు..ఉద్యమ కారుల బ్లూ ప్రింట్ తీసుకున్నాం.చాలా బాగా నిర్వహించుకోవాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది.ఎన్నికల కోడ్ కారణంగా పరిమితంగా చేసుకోవలసిన పరిస్తితి వచ్చింది.ఎటువంటి అతిక్రమణలకు పాల్పడకుండా జరుపుకుంటామన్నారు..వేలాది మందితో నిర్వహించుకోవాలని భావించినా.. కొద్ది మందితో చేసుకోవాల్సిన పరిస్తితి ఉంది.ఉద్యమంలో పాల్గొన్న వారు అనేక మంది మాకు ఈఎఖీ కాఫీలు పంపారు.జేఏసీ బయట ఉన్న అనేక సంఘాలు.. పాల్గొననున్నారు.హైదరాబాద్ వరకు రాలేని వారు.. జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో నిర్వహించే వేడుకలలో పాల్గొనాలని కోరారు..పరేడ్ గ్రౌండ్స్ లో పెట్టగలిగే వీలున్నంత మంది ఉద్యమ?చాలా మంది ఉద్యమకారులకు ఆహ్వానం అందలేదు అనే ప్రచారం జరుగుతుంది..అందరం కలసి నిర్వహించుకునే వేడుకలకు.. వైరుధ్యాలు,వ్యతిరేకత లు వద్దు.కేసిఆర్ గారు మీరు తప్పక రండి.. సెప్టెంబర్,అక్టోబర్ లో ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ ఉంటుంది.అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా గేయాన్ని జాతీయకి అంకితం చేయడమే ఎజెండా..ఆహ్వానం విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే కోదండరాం, యెన్నం శ్రీనివాసరెడ్డి, దయాకర్ దృష్టికి తీసుకువచ్చిన సహకరిస్తామన్నారు.

# 33 గ్రాముల విదేశీ డ్రగ్

### హైబ్రీడ్ కన్నాబిస్(కుష్) పట్టివేత

### ముగ్గురు పై కేసు నమోదు చేసిన ఎస్టిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు

విదేశాల నుండి దిగుమతి చేసిన హైబ్రీడ్ కన్నాబిస్ మత్తు మందును తార్నాక డివిజన్ లాలాపేట పరిధిలో అమ్ముతుండగా ఇద్దరు నిందితులను ఎస్టిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్టిఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండ్ కే ప్రదీప్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైబ్రీడ్ కన్నాబిన్ (కుష్) మాదకద్రవ్యాన్ని లాలాపేటలో అమ్ముతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది మహేశ్వర్, అరుణ్, యాదగిరి తో కలిసి లాలాపేట బ్రిడ్జి వద్ద మాటువేసి హైబ్రీడ్ కన్నాబిస్ అమ్ముతున్న లాలపేటకు చెందిన ఆమన్ (మహమ్మద్ ఖాన్), మహమ్మద్ ముబీన్ లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 23 గ్రాముల కన్నాబీస్ స్వాధీనం చేసుకొని విచారించారు. వారికి మల్కాజ్గిరి ప్రాంతానికి చెందిన నిఖిల్ నాయక్ అనే వ్యక్తి అందించాడని చెప్పడంతో, వెంటనే నిఖిల్ నాయక్ ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద 10గ్రాముల కన్నాబిస్ ను స్వాధీన పరుచుకున్నారు. ముగ్గురు నుండి 33 గ్రాముల మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిని మహమ్మద్ అబ్దుల్ మోబిన్ బెంగళూరు కు వెళ్లి అక్కడ విదేశీయుల నుండి కొనుగోలు చేసి , హైదరాబాద్ కు తీసుకొచ్చి మహమ్మద్ ఖాన్, నిఖిల్ నాయక్ లు కలిసి యువతకు అమ్ముతారు. దీనిని గ్రామ కు రూ,3500 చొప్పున అమ్ముతారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న 33 గ్రాముల మాధకు ద్రవ్యం విలువ రూ,1.32 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మాదక ద్రవ్యాలు విదేశాల నుండి అక్రమంగా సముద్ర మార్గం ద్వారం బెంగళూరు, కొరెనూర్ కు సరఫరా అవుతున్నట్లు గుర్తించామన్నారు. దీనిని హిందుకుష్ పర్వతశ్రేణుల్లో , ఆఫ్రికా, అమెరికా దేశాల్లో ఎక్కువ పండిస్తారని తెలిపారు. ఉదయం చూడడానికి గాంజాయిలా ఉన్న ఇందులో టీహెచ్సీ రసాయన పదార్థం 26 శాతం అధికంగా ఉంటుందని వివరించారు.దీనిని ఓజి, కుష్ పేర్లతో కూడా పిలుస్తారని తెలిపారు.

# దండకారణ్యంలో 'కగార్" పేరిట మరణహోమం

### - ఆపరేషన్ 'కాగార్' ను వెంటనీ నిలిపి వేయాలి

### - నిజనిర్ధారణ బృందాని పోలీసులు అడ్డుకోవడం మానవ హక్కుల ఉల్లంఘనే

### - కార్పరేట్ ప్రయోజనాల కోసం అడివిని నెత్తుటి

### - మడుగుగా మార్చిన మోడీ సర్కార్

### - సీపీఐ( యం ఎల్) చంద్రు పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ

హైదరాబాద్: ;చెత్తిస్ ఘా ఢ్ లో ఆదివాసీలను,వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో " ఆపరేషన్ కాగార్ ని మోడీ ప్రభుత్వం అమలు చేయడాన్ని సీపీఐ( యం ఎల్) చంద్రు పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ తీవ్రంగా నిరసించింది. ఆదివాసి ప్రజలపై జరుగుతున్న హత్యకాండపై మరియు వరుసగా జరిగిన 120 మంది మావోయిస్టుల భూటకపు ఎన్ కౌంటర్లను తీవ్రంగా నిరసిస్తూ జరిగిన బహిరంగ సభలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని తీవ్రంగా ఖండిస్తూ సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం(సి.ఎల్.సి.), ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ(సిడిఆ0) ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు గడ్డం లక్షణ్, నారాయణ రావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జనవరి1 నుండి మరణ హోమా న్ని సాగిస్తుంది,అడివి ప్రాంతాన్ని రక్తసిక్తము చేస్తుంది,వరుసగా బూటకపు ఎదురు కాల్పులకు దిగి ,వందల మంది ఆదివాసీ లను కాల్చిచంపి ,ఆదివాసీ గూడ లను కూల్చి వేస్తూ ,అమాయక ఆదివాసీలను ఆడువుల నుండి తరిమి కొడుతున్నారని సీపీఐ( యం ఎల్) సీపీ రెడ్డి పార్టీ కేంద్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సంఘటనలపై నిజనిర్ధారణ కోసం అఆఖీూ, పౌరహక్కుల సంఘం 52 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ మే 30 న చేత్తి స్ ఘా ఢ్ దండకారణ్యానికి వెళ్ళింది వారిని కుంట. వద్ద అఖీఖఈ అడ్డుకోవడం ,మానవ హక్కుల ఉల్లంఘనే , నిజనిర్ధారణ బృందం కుంట నుండి వెనుదిరిగి బీజా పూర్ మీదుగా వెళ్లేందుకు బయలు దేరి తే తరగూడ వద్ద అఖీఖఈ బలగాలు,పోలీసు లు అక్కడ అడ్డుకున్నారు ,బృందని అడ్డుకోవడమే కాకుండా ,ఇది "వార్ జోన్ " ఇక్కడ రావడం నిషిద్ధం అని ,తిరిగి వెళ్ళిపోవాల్సిందిగా లేని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని నిజనిర్ధారణ బృందని హెచ్చరించడం తీవ్రమైన చర్య కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ ,బీజేపీ ప్రభుత్వం, బహుళజాతి. కంపినీలు, చేస్తున్న కుట్ర ఆడువు లో ఉన్న అపారమైన ఖనిజ, నిది,నిక్షేపాలు,రంగురాలు,ముడిసరుకు,సంపదను దోచుకెళ్ళేందుకే , అడు వులో మావోయిస్టు రహిత దేశం పేరుతో సొంత అడివి జాతి ప్రజలపైన యుద్ధం ప్రకటించడం మోడీ,అమిషా,రాజ్ నాథ్ సింగ్, వీరి పరివేక్షణలో ఈ యుద్ధం కొనసాగుతున్నది.బడా కార్పరేట్ ప్రయోజనాల కోసం అడివిని నెత్తుటి మడుగుగా మార్చే మోడీ సర్కార్ పాసిస్ట్ చర్యను మా పార్టీ తీవ్రంగా కండిస్తుంది వివిధ హక్కుల సంఘాలు నియమించిన నిజనిర్ధారణ కమిటీని అడ్డుకోవడం మా పార్టీ తీవ్రంగా కండిస్తుంది. ఈ చర్యను మనవతవదులు, మేదావులు, అభ్యుదయ వాదులు, ప్రజాస్వామిక వాదులు, ఖండించి ప్రజా హక్కుల సాధనకై ఐక్య ఉద్యమాలకు కలిసి రావాల్సిందిగా పిలుపు నిచ్చింది. పేసా చట్టాన్ని, రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్లను అమలు చేయాలని, ఛత్తీస్ ఘడ్ ప్రాంతంలో ఉన్నటువంటి సాయుధ మిలిటరీ క్యాంపులన్నింటిని ఎత్తివేయాలని, హక్కుల సంఘాలకు, ప్రజాసంఘాలకు, ప్రజాస్వామిక వాదులకు నిజనిర్ధారణ చేయడానికి అవకాశం కల్పించాలని, వెంటనే ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం మావోయిస్టులతో జరిగే శాంతి చర్చలకు అనువైన వాతవరణం కల్పించి, శాంతి చర్చలు జరిపించాలని ముక్త ఖంఠంతో డిమాండ్ చేసిన వారిలో ప్రొఫెసర్ హరగోపాల్, సిపిఎం డి.జి. నర్సింగరరావు, సిడిఆ0 క్రాంతి చైతన్య, సిఎల్సీ చిట్టిబాబు, చంద్రశేఖర్, వీక్షణం వేణుగోపాల్, విరసం పాణి, సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ మల్లెపల్లి ప్రబాకర్, న్యూడెమోక్రసీ వేములపల్లి వెంకట రామయ్య, మాస్ లైన్ హన్మేశ్, ఇఫ్టూ అనురాధ, అరుణోదయ విమల, భారత అరుణోదయ ఇనుప సురేష్, రైతు సమాజ వేధిక కన్నెగంటి రవి, అమరుల బంధుమిత్రుల సంఘం పద్మ కుమారి, ప్రజాకళామండలి డి. జాన్ మరియు తదితరులు ఉన్నారు.

# నిబంధనల ప్రకారం కౌంటింగ్ నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలి

### -జిల్లా కలెక్టర్,పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

### -కౌంటింగ్ హల్ లో సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

మంథని : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 8 గంటలకు జేఎన్టీయు కళాశాల నందు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తుంచు కోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు. .కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహిం చేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటిసంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించా లని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్ లను హమాలీలు తీసుకుని వస్తారని,ప్రతి 2 టేబుళ్ళకు ఒక హమాలీ ఉంటారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందని, ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహి స్తారని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ పూర్తిగా చెక్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్ యొక్క పింక్ సీల్, గ్రీన్ ఫీల్డ్ చెక్ చేసి కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలని, కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్ ను సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్ లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని, కంట్రోల్ యూనిట్ లో ఎటువంటి ఇబ్బం దులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని అన్నారు. కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, 14 టేబుల్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు సహాయ రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వివి ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవు తుందని , వివి ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం సర్వీస్ ఓటర్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన పది మంది ఆపరేటర్లతో పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఈ.టి.పి.బి.ఎస్ విధానం ద్వారా సర్వీస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, కౌంటింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 150 దేశాలకు కొత్త వంగడాలు

మెదక్, జూన్ 3: ఆధునిక సాగు విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్రిసాట్ కృషి చేస్తున్నది. శాస్త్రీయ విధానాలు, కొత్త వంగడాల ఆవిష్కరణలతోపాటు, జన్యు బ్యాంక్ సాయంతో అంతరించి పోతున్న ఆహార పంటలను సంరక్షిస్తూ రైతులకు అందిస్తున్నది.శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగు, పంటల నిర్వహణతో రైతుల ఆదాయం, ఆహార పంటల దిగుబడి, పర్యావరణంలో కార్బన్ ఎమిషన్ తగ్గించేందుకు అవసరమైన పరిశోధనలను కొనసాగిస్తూనే.. జెనీ బ్యాంక్ ద్వారా పరిశోధన సేవలను ఖండాంతరాలకు ఇక్రిసాట్ విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాలకు ఇక్రిసాట్ పరిశోధన ఫలాలను అందిస్తుండగా.. ఇప్పటివరకు 1.65 మిలియన్ల సీడ్ శాంపిళ్లను పలు ప్రాంతాలకు చేర్చింది.ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఇక్రిసాట్ పరిష్కారం చూపే క్రమంలో భాగంగా జెనీ బ్యాంక్ ద్వారా అంతరించిపోతున్న ఆహార పంటలను సంరక్షిస్తున్నది. ప్రధానంగా కందులు, బఠాణీ, వేరుశనగతో పాటు 8 రకాల చిరుధాన్యాల జన్యులను సంరక్షిస్తూ.. వినూత్న వంగడాలను ప్రపంచదేశాలకు అందిస్తున్నది. కరువు, నీటి లవణీయత, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే వంగడాలను అభివృద్ధి పరుస్తూ.. వాతావరణ మార్పులకు ధీటుగా అధిక దిగుబడిని సాధించేలా కృషి చేస్తున్నది. ఈ క్రమంలో ఇప్పటివరకు 150 దేశాలకు 1.65 మిలియన్ల విత్తన శాంపిళ్లను అందించింది.ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రత కారణంగా అంతరించిపోతున్న ఎన్నో రకాల ఆహార పంటలను సంరక్షించేందుకు పరిశోధనలు చేస్తుండగా.. ప్రధాన ఆహార పంటల్లో ఒకటైన సజ్జలను 25వేల జెర్మ్ ప్లాజమ్ నిల్వ చేసి అందించారు. 93 దేశాలకు వేరుశనగ, 61 దేశాలకు బఠాణీ, 72 దేశాలకు కందులు, 93 దేశాలకు జొన్నలు, 51 దేశాలకు సజ్జలు, మరో 51 దేశాలకు చిరుధాన్యాల విత్తన బ్యాంక్ను అందించి వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలు ఇక్రిసాట్ డెవలప్ చేసిన వంగడాలను వినియోగిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

# ములుగులో పేలిన మందుపాతర.. వ్యక్తి మృతి

ములుగు: ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకున్నది. పోలీసుల కోసం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వాజేడు మండలం కొంగాల గుట్టపై కట్టెల కోసం ముగ్గురు వ్యక్తులు అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ఏసు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఏసు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడినవారిని అదే గ్రామానికి చెందిన రమేశ్, ఫకీర్గా గుర్తించారు. అయితే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

# హైదరాబాద్ కేంద్రంగా నకిలీ మందుల ముఠా

హైదరాబాద్: ప్రాణాలను కాపాడే ఆ మందులను కూడా కొన్ని ముఠాలు నకిలీ చేస్తున్నాయి. ఇలా పలు క్యాన్సర్ మందులకు నకిలీలు తయారుచేసి, మార్కెట్లో సరఫరా చేస్తున్న ఘరానా ముఠా గుట్టును తెలంగాణ రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు రట్టు చేశారు. రెండు నెలలుగా డీసీఏ అధికారులు చేపడుతున్న తనిఖీల్లో జ్వరం, దగ్గు, నొప్పులు, రక్తపోటు, మధుమేహం, చివరికి ప్రాణాంతక క్యాన్సర్‌కు కూడా కేటుగాళ్లు నకిలీ మందులు తయారుచేయటం తెలుసుకుని అధికారులు అవాక్కయ్యారు. ఇవిగాక కాలం చెల్లిన మందులు, వాటిని విక్రయించే అనుమతిలేని మెడికల్ షాపుదారుల దురాశ కూడా రోగుల జేబులను, ఒంటినీ గుల్లచేస్తోంది. ఈ కల్తీ మందుల మాఫియా మీద తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపే క్రమంలో రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి(డీసీఏ) చేస్తున్న దాడులు, తనిఖీల్లో బిత్తరపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కల్తీ మందుల్లో కొన్ని ఇక్కడే తయారవుతుండగా, మరికొన్ని ఉత్తరాది నుంచి దిగుమతి అవుతున్నాయి. హైదరాబాద్‌లో పట్టుబడిన మందుల్లో మెజారిటీ హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కాశీపుర్‌లో తయారైనవవిగా అధికారులు గుర్తించారు. అక్కడ నుంచి కొరియర్ కంపెనీల ద్వారా మందులను తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. వాటిలో యాంటీబయాటిక్స్, రక్తపోటు, కొలెస్ట్రాల్ తగ్గించేవి ఉన్నాయి. ప్రముఖ తయారీ సంస్థలైన సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్ ఫార్మా, అరిస్టో ఫార్మా వంటి సంస్థల మాత్రలు, మందులకు డూప్లికేట్ మందులను తయారుచేసి, చక్కని లేబుల్‌తో వీటిని విక్రయిస్తున్నారు.రాష్ట్రంలో లైసెన్సు లేకుండానే అనేక మెడికల్ షాపులు నడుస్తున్నట్లు తనిఖీల్లో బయటపడుతోంది. రాజధాని నుంచి గ్రామాల వరకు ఇదే పరిస్థితి. మరోవైపు వివిధ నర్సింగ్‌హోంలు కూడా ఎలాంటి లైసెన్స్ లేకుండానే మెడికల్ షాపులు నిర్వహిస్తున్నాయి. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు ఇళ్లలోనే మందుల దుకాణాలు నడుపుతున్నారు. ఈ నకిలీ మందుల మాఫియాలు మందుల షాపులకు పెద్ద మొత్తంలో కమిషన్ ఎరవేసి, ఈ మందులను అమ్మి సొమ్ముచేసుకుంటున్నట్లు విచారణలో అధికారుల దృష్టికి వచ్చింది. నకిలీ మందుల కంపెనీలు, మందుల షాపులు, ఏజెంట్లు.. ఇలా వీరంతా ఒక్కటై జనం ఒళ్లు గుల్లచేస్తున్నారు. అసలు మందుల కంటే కల్తీ మందుల ధర మూడో వంతు ఎక్కువగా ఉన్నట్లు కూడా అధికారులు తనిఖీల సందర్భంగా గుర్తించారు. ఈ ముఠాలు మందులపై 40 శాతం అధిక ధరలు ముద్రించి వాటిపై భారీ కమిషన్‌ను మందుల షాపుకు ముట్టజెబుతున్నట్లు సమాచారం. ఈ అధిక ధరల అంశంపై తాజాగా అధికారులు 50కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ.113.60 విలువైన వాస్ఫిన్-ఓ 5 ఎంజీ ఆయింట్‌మెంట్‌ను హైదరాబాద్‌లోని బీరంగూడ, మల్కాజిగిరిలో రూ.140కి అమ్మటం, ఇట్రాకాప్-200 పది మాత్రలకు రూ.247.70 తీసుకోవాల్సి ఉండగా రూ.285కి అమ్మటాన్ని కూడా అధికారులు గుర్తించారు.చిన్నా చితకా రోగాల మందుల్లో పెద్దగా లాభాలు రావనుకున్నారో ఏమోగానీ, కేటుగాళ్లు ఏకంగా కేన్సర్ మందులకూ నకిలీలు చేయటం మొదలుపెట్టారు. అల్లోపతి మందులతో బాటు ఆయుర్వేద మందులనూ కుటీర పరిశ్రమలో వస్తువులు చేసినట్లుగా చేయటాన్ని చూసి తనిఖీ అధికారులు నోరెళ్లబెడుతున్నారు. వీరిలో కొందరు ఫుడ్‌లైసెన్స్ అనుమతి తీసుకుని మందులు తయారుచేయటం గమనార్హం. ఇవిగాక, అక్రమంగా బ్లడ్‌బ్యాంకుల నిర్వహణ, అనుమతి లేకుండానే దాతల నుంచి ప్లాస్మాను సేకరించడం, బిల్లుల్లేకుండానే మందులు అమ్మటం, భారీగా మందులు నిల్వచేయటం వంటి అక్రమాలు అధికారుల తనిఖీల్లో బయట పడుతున్నాయి.

## 70 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్: హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు మార్గాన్ని మెరుగుపర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూర్ ఫారెస్ట్ చెక్‌పోస్టు నుంచి శ్రీశైలం వరకు అత్యంత పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తే రాత్రి వేళల్లో సైతం ఎలాంటి అడ్డంకులు లేకుండా శ్రీశైలం వెళ్లేందుకు వీలవుతుంది. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఉన్నందున ప్రస్తుతం మన్ననూరు చెక్‌పోస్టు నుంచి రాత్రి వేళల్లో ప్రయాణాలను అనుమతించడం లేదు.ప్రస్తుతం ఆ మార్గంలో 70 కి.మీ. మేర డబుల్ లేన్ మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ అవసరాలకు సరిపోవడం లేదు. ఈ మార్గాన్ని విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ నల్లమల అటవీ ప్రాంతం కావడంతో అనుమతులు లభించడంలేదు. ఈ నేపథ్యంలో మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి నల్లమల అటవీ ప్రాంతం మీదుగా శ్రీశైలం వరకు 4 లేన్లతో 70 కి.మీ. పొడవైన ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును నిర్మించాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శా ఖ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది.

# వానాకాలం పంట సీజన్ కు సమృద్ధిగా విత్తనాలు

**- అవసరానికి మించి 50 శాతం అదనంగా ఉన్న విత్తనాల స్టాక్**

**- రైతులు లైసెన్సుడ్ డీలర్ల వద్ద నుంచి రశీదు పొంది విత్తనాలను కొనుగోలు చేయాలి**

**- నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు**

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి : రాబోయే వానాకాలం పంట సీజన్ కు మన జిల్లాలో సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాల స్టాక్ డీలర్ల వద్ద ఉందని, రైతులు అనవసరపు ఆందోళనలు చెందవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో వానాకాలం విత్తనాల లభ్యతను వివరిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తో కలిసి మీడి యా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మన జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వచ్చే వానాకాలం పంటకు ఎక్కడా విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న 353 విత్తన డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న లక్షా 55 వేల 496 మంది రైతులకు 2 లక్షల 77 వేల 720 ఎకరాల సాగు భూమి ఉందని, వీటిలో 2 లక్షల 8 వేల ఎకరాలలో వరి పంట, 60 వేల ఎకరాలలో పత్తి పంట, 12 వేల ఎకరాలలో కూరగాయలు పండ్లు ఇతర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతి పంటకు సంబంధించి అవసరానికి మించి 50 శాతం అదనంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా విత్తనాల కొరత లేదని, ఎక్కడైనా విత్తనాల రవాణా, తదితర అంశాలలో చిన్న, చిన్న ఇబ్బందులు వచ్చి ఒకటి, రెండు రోజులు రైతులకు చేరడంలో ఆలస్యం కావచ్చని, విత్తనల స్టాక్ కు ఎక్కడ కొరత లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న పంటలు వారు వినియోగిస్తున్న విత్తనాలపై వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, సదరు విత్తనాలు సమీప విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వానకాలం ప్రారంభ మవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్టె విత్తనాలు సైతం అందుబాటు లో ఉన్నాయని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్ లు, పత్తి విత్తనాలలో 134 రకాల విత్తనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. బీజి3 వంటి పత్తి విత్తనాలను నిషేధించడం జరిగిందని, వీటిని ఎక్కడా డీలర్లు విక్రయించ కుండా చర్యలు తీసుకున్నామ ని, రైతులు ఎక్కడ కూడా ఈ విత్తనాలను ఉపయోగించవ ద్దని, ఎవరైనా ఈ విత్తనాలు విక్రయిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి విత్తనపు, ఎరువుల డీలర్ దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాక్ పరిశీలిస్తున్నా మని, ప్రతి దుకాణం వద్ద అందు బాటులో ఉన్న స్టాక్ వివరాలు, వాటి రేట్లను నోటీస్ బోర్డ్ పై ఏర్పాటు చేయాలని, ప్రతి విక్రయం వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నామని తెలిపారు. పోలీసు శాఖ సహకారంతో నకిలీ విత్తనాల విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. విత్తనాల లభ్యతపై రైతులకు ఉన్న అపోహలు తొలగించేం దుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, రైతులకు అపోహలు సందేహాలు ఉంటే కాల్ సెంటర్ నెంబర్ 9573951060 కు ఫోన్ చేయాలని కలెక్టర్ కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అబద్ధపు ప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదని, రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీ విత్తనా లను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, రైతులు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫైడ్ డీలర్లు వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయా లని, విడిగా ఎక్కడా విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కల్తీ విత్తనాలను రాకుండా అంతర్ జిల్లా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు.ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పోలీస్ కమిషనర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు,మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ నైజీరియన్ అరెస్టు

హైదరాబాద్: నైజీరియా దేశానికి చెందిన కాస్మోస్ రాంసి అలియాస్ ఆండి బిజినెస్ వీసాపై భారత దేశానికి వచ్చాడు. 2014లో న్యూఢిల్లీకి వచ్చి అక్కడి నుండి హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. దుస్తుల ఎగుమతి వ్యాపారం పేరుతో దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించాడు. 2016 లో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఇతనితో పాటు మరో నైజీరియన్‌ను గోల్కొండ పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత బెంగళూరుకు చెందిన ఒబాసి అనే నైజీరియన్ నుంచి కొకైన్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో పెడ్లర్‌గా మారాడు. 2018లో కొకైన్ సరఫరా చేస్తుండగా గోల్కొండ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కస్టమర్లకు టెలిగ్రామ్ ద్వారా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడు. ప్రస్తుతం రాంసి నుంచి 16 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నాము. లక్ష్మీపతి అనే మరో డ్రగ్ పెడ్లర్‌ను అరెస్టు చేశాం. అతని వద్ద నుంచి 43 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ స్వాధీనం చేసుకున్నాం అని డీసీపీ తెలిపారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ సంఘటన జిల్లాలోని భీంపూర్ మండలంని అర్లి-ఇందూర్‌పల్లి మార్గంలో సోమవారం చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డు గుంతలుగా మారడం వల్లే బస్సు అదుపు తప్పడానికి కారణమని ప్రయాణికులు తెలిపారు. కాగా, తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## లిక్కర్ ఒనర్స్ పంచాయితీ

హైదరాబాద్: తెలంగాణలో అత్యంత లాభదాయకమైన వ్యాపారం మద్యం వ్యాపారం. తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా ఎక్కువ ఆదాయం వచ్చే బిజినెస్ ఇదొక్కటే. మద్యం షాపులు, బార్ ఓనర్లే కాదు.. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారు కూడా భారీగా వెనకేస్తున్నారు. అందుకే బార్స్, వైన్స్ లైసెన్స్‌ల కోసం లక్షల రూపాయల వెచ్చించేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇక మద్యం షాపులు, బార్ల ద్వారా ప్రభుత్వానికి నిత్యం కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ఇలా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగే వ్యాపారాన్ని ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.భారీగా లాభాలు వచ్చే మద్యం షాపులు, బార్లలో నేతలు, కార్పొరేట్ సంస్థల యజమానులు భారీగా పెట్టుబడి పెడుతున్నారు. కొందరు డైరెక్టుగా పెట్టుబడి పెడితే.. కొందరు ఇండైరెక్టుగా వీటిలో వాటా కలిగి ఉంటారు. అందుకే రెండేళ్ల కోసారి నిర్వహించే మద్యం షాపుల టెండర్లకు పోటీ పెరుగుతూనే ఉంది. టెండర్ ఫీజుల లక్షల రూపాయలు ఉంది. తిరిగి చెల్లించరు.. అయినా టెండర్లు వేస్తూనే ఉన్నారు.ఇక ఇప్పుడు తెలంగాణలో బార్ ఓనర్లు, వైన్స్ ఓనర్ల మధ్య కొత్త పంచాయతీ మొదలైంది. బార్‌షాపుల ఓనర్లంతా ఒక్కటై వైన్ షాపుల యజమానులపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వైన్ షాపు పక్కన పర్మిట్ రూమ్స్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఇది 100 చ.మీ మించి ఉండకూడదు. కానీ మద్యం షాపుల యజమానులు వీటిని పట్టించుకోవడం లేదు. 2 వేల చ.మీ వరకు కూడా పర్మిట్ రూమ్స్ నిర్వహిస్తున్నారు. దీంతో బార్లకు వచ్చే కస్టమర్లు తగ్గిపోతున్నారు. ఇక వైన్ షాపులలో ఎలాంటి తినుబండారాలు తయారు చేయరాదు. కానీ వైన్స్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే పర్మిట్ రూంలు మినీ బార్లుగా కనిపిస్తున్నాయి. ఒక్క ఏసీ మినహా ఇక్కడ అన్ని వసతులు ఉంటున్నాయి. అన్నిరకాల ఆహార పదార్థాలు దొరకుతుంటాయి.ఇదిలా ఉంటే.. వైన్స్‌కు ప్రభుత్వం చాలాకాలంగా పర్మిట్ రూంలకు అనుమతి ఇస్తుంది. ఇందుకు అదనంగా రూ.2 లక్షల రుసుం వసూలు చేస్తుంది. అయితే, ఇన్నాళ్లూ పెద్దగా పట్టించుకోని బార్ల యజమానులు ఇప్పుడు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది చివర్లో మద్యం షాపులకు టెండర్లు పిలిచింది. అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది నుంచి కొత్త షాపులు అమలులోకి వచ్చాయి. కొత్తగా షాపులు ఏర్పాటు చేసుకున్న యజమానులు పర్మిట్ రూం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఇష్టానుసారంగా వందల చదరపు మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ రూంలు ఏర్పాటు చేశారు. దీంతో బార్లకు నాలుగైదు నెలలుగా గిరాకీ తగ్గింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బార్ల యజమానులు ఒక్కటై ఫిర్యాదు చేశారు. మరి దీనిపై ఎక్సైజ్ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ప్రభుత్వ విద్యా సంస్థలను నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులదే.

**ప్రభుత్వ విద్యాసంస్థలు మూతబాటు కు కారణం ప్రభుత్వ వైఫల్యమే .**

**ఆర్థిక అసమానతలు పోవాలంటే ప్రభుత్వ బడులు నిలబడాలి**

**.ప్రభుత్వ విద్యా రంగంపై తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత టీచర్లతో పాటు అందరిదీ**

**. ప్రపంచంలో విద్యను ఏ దేశం వ్యాపార మయం చెయ్యలేదు.భారతదేశంలో తప్పా**

**. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తెలంగాణ పౌర స్పందన వేదిక కృషి.**

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి**

సూర్యాపేట జిల్లా: జూన్ 3: విద్యార్థుల నమోదు లేక మూతపడే స్థితికి వస్తున్న ప్రభుత్వ విద్యా సంస్థలను నిలబెట్టే బాధ్యత ప్రజా ప్రతినిధులదే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో తెలంగాణ పౌరస్ స్పందన వేదిక కోదాడ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులు నిలబడాలి,చదువుల్లో అంతరాలు పోవాలి అనే అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. గత పది ఏళ్లలో ప్రభుత్వ వైఫల్యంతో ప్రభుత్వ విద్యా రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాల ల్లో కళాశాల ల్లో స్కావెంజర్లు నియామకం చేయకపోవడం అత్యంత దారుణం అన్నారు .జిల్లా కలెక్టరేట్ సెక్రటేరియట్ లో కూడా ఉడిచే వారి తాళం వేసేవారు లేకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని ప్రభుత్వానికి గుర్తు చేశారు. పాఠశాలలలో స్కావెంజర్ లేక ఉపాధ్యాయులే పాఠశాలలను శుభ్రం చేస్తున్నారని, ప్రధానోపాధ్యాయులే తాళం తీయడం వేయడం పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్కావెంజర్లను నియామకం చేయాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను మార్చాలన్నారు. పాలకవర్గాల విధానాలతోనే ప్రైవేటు విద్యారంగం మూడు పూవులు ఆరు కాయలుగా కొనసాగుతుందని ఆర్థిక అంతరాలు పోవాలంటే ప్రభుత్వ బడులు నిలబడాలన్నారు .ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల తో పాటు ఉద్యోగులు ,ప్రజా ప్రతినిధులు ,తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగంపై తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉందని తల్లిదండ్రులకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పిల్లలు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండాలని ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని ప్రధానోపాధ్యాయుడిని నియామకం చేయాలని డిమాండ్ చేశారు .బడి అంటే ఒక ఉపాధ్యాయులదే బాధ్యత కాదని ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు బాధ్యతగా తీసుకొని పాఠశాలలకు వసతులతో పాటు విద్యార్థుల నమోదుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలన్నారు. ప్రపంచంలో భారత్ దేశం తప్ప ఏ దేశం విద్యారంగాన్ని వ్యాపారమయం చేయలేదని ఆరోపించారు. భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలో విద్య అత్యంత వ్యాపారమయంగా మారిందన్నారు .ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడకపోతే తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వ బడి లేని రాష్ట్రంగా మారి చరిత్రలో నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపాధ్యాయులు కూడా ఒక పౌరునిగా ఆలోచించి ప్రజా చైతన్యం ద్వారా ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే పాఠశాల గ్రాంటు పాఠశాల ప్రారంభంలోనే సమకూర్చేలన్నారు. బడిబాటలో అందరూ భాగస్వాములై ప్రభుత్వ బడిని నిలపాలన్నారు. ప్రభుత్వ బడులు నిలబడాలని చదువుల్లో అంతరాలు పోవాలని అప్పుడే రాజ్యాంగం లో ఉన్న విధంగా ఆర్థిక అసమానతలు తగ్గుతాయన్నారు .ప్రభుత్వ విద్యాసంస్థలు పాఠశాలలు కళాశాలల పరిరక్షణకు విద్యా వైద్యం ప్రభుత్వ బాధ్యత అనే నినాదం తో తెలంగాణ పౌర స్పందన వేదిక అందరినీ భాగస్వాములు చేసి కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేవీ మంగా, జిల్లా అధ్యక్షులు ఆర్ ధనమూర్తి ,కోదాడ ప్రాంతీయ అధ్యక్షులు వెంకటరమణ, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి, టి ఏ పి ఆర్ పి ఏ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం వెంకటరెడ్డి, యుటిఎఫ్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ టెట్ ప్రాథమిక కీ విడుదల..

హైదరాబాద్ : తెలంగాణలో ఇటీవల నిర్వహించిన టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ) పరీక్ష ప్రాథమిక కీ విడుదల అయింది. మే 20 నుంచి జూన్ 2 వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. పేపర్ 1కి 86.03 శాతం మంది, పేపర్-2కి 82.58 శాతం మంది హాజరయ్యారు. జూన్ 3 నుంచి 5 వరకు అధికారిక వెబ్ సైట్‌లో ప్రాథమిక కీ ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. కాగా, 11,062 టీచర్ పోస్టులతో ప్రభుత్వం డీఎస్సీ-2024 నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. పేపర్-1 కి 99,958 మంది.. పేపర్-2కి 1,86,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 12వ తేదీన ఫలితాలు విడుదల కానున్నాయి.

# అమెరికా అద్భుతః.. పొట్టి ప్రపంచకప్‌నకు అదిరిపోయే ఆరంభం

### రికార్డు ఛేదనలో యూఎస్ఏ చారిత్రాత్మక విజయం
### ఆరోన్ జోన్స్ వీరోచిత పోరాటం
### బౌలింగ్‌లో చేతులెత్తేసిన కెనడా
### 'బేస్‌బాల్, బాస్కెట్‌బాల్‌కు అమితమైన క్రేజ్ ఉన్న అమెరికాలో క్రికెట్ సక్సెస్ అవుతుందా?



ఆతిథ్య హోదాలో యూఎస్ఏ ఉనికిని చాటుతుందా?' అన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ అమెరికా క్రికెట్ జట్టు అద్భుతమే చేసింది. అవకాశమొస్తే సత్తా చూపించేందుకు 'మేం కూడా సిద్ధం' అని తొలి మ్యాచ్‌తోనే ప్రపంచానికి ఘనంగా చాటి చెప్పింది. అగ్రశ్రేణి జట్లు సైతం ఒకటికి రెండుసార్లు ఆలోచించి బరిలోకి దిగే రికార్డు ఛేదన (195)ను అంతర్జాతీయ క్రికెట్‌లో, మరీ ముఖ్యంగా ఈ ఫార్మాట్‌లో అంతగా అనుభవం లేని యూఎస్ఏ 3 వికెట్లు మాత్రమే కోల్పోయి మరో 14 బంతులుండగానే ఊదేసింది. భారీ ఛేదనలో ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ ఆరోన్ జోన్స్ వీరవిహారం చేయగా ఆండ్రిస్ గోస్ అతడికి అండగా నిలిచాడు. బ్యాటింగ్‌లో రాణించిన కెనడా.. బౌలింగ్‌లో విఫలమై మూల్యం చెల్లించుకుంది.

డల్లాస్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వెస్టిండీస్/అమెరికాలలో సంయుక్తంగా నిర్వహిస్తోన్న తొమ్మిదవ టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌కు ఘనమైన ఆరంభం. ఈ ఫార్మాట్‌కు తొలిసారి ఆతిథ్యమిస్తున్న యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ).. తమ ప్రారంభ మ్యా చ్‌లోనే కెనడాను ఏ డు వికెట్ల తేడాతో చిత్తుచేసి సంచలన విజ యం దక్కించుకుంది. రికార్డులు బద్ధలైన ఈ మ్యాచ్‌లో కెనడా నిర్దేశించిన 195 పరుగుల ఛేదనలో 3 వికెట్లు మాత్రమే నష్టపోయి 17.4 ఓవర్లలోనే పూర్తిచేసి చారిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. లక్ష్య ఛేదనలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ఆరోన్ జోన్స్ (40 బంతుల్లో 94 నాటౌట్, 4 ఫోర్లు, 10 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ప్రత్యర్థి బౌలర్లపై వీరవిహారం చేయగా ఆండ్రిస్ గోస్ (46 బంతుల్లో 65, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించి ఆ జట్టుకు ఘనవిజయాన్ని అందించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కెనడా.. నవ్‌నీత్ ధలివల్ (44 బంతుల్లో 61, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), నికోలస్ కిర్టన్ (31 బంతుల్లో 51, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది.

**ఆరోన్ అదుర్స్:**

48/2. 195 పరుగుల ఛేదనలో 8 ఓవర్లు ముగిసేసరికి అమెరికా చేసిన స్కోరది. చివరి 72 బంతుల్లో ఆ జట్టు విజయానికి 147 పరుగులు కావాలి. చేతిలో వికెట్లు ఉన్నా ఒత్తిడిలో చిత్తుకాకపోతారా? అని కెనడా ఆశలు. కానీ గోస్, జోన్స్ ప్రత్యర్థికి ఆ అవకాశమే ఇవ్వలేదు. నిఖిల్ దత్తా వేసిన 9వ ఓవర్లో 19 పరుగులు రాబట్టడంతో ఈ ఇద్దరూ బాదుడుకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత 9 ఓవర్ల పాటు ఈ జోడీకి అడ్డుకట్ట వేసేందుకు కెనడా చేసిన ఏ ప్రయత్నమూ ఫలించలేదు. జఫర్ వేసిన 13వ ఓవర్లో రెండు సిక్సర్లు బాది 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన జోన్స్ ఆ తర్వాత మరింత ప్రమాదకరంగా మారాడు. గోర్డాన్ 14వ ఓవర్లో గోస్ 6,4తో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. ఈ ఓవర్లో అమెరికా ఏకంగా 33 పరుగులు పిండుకోవడంతో ఆ జట్టు విజయం దాదాపు ఖరారైంది. దూకుడుగా ఆడే క్రమంలో గోస్ 16వ ఓవర్లో నిష్క్రమించినా జోన్స్ మాత్రం పట్టు వీడలేదు. నిఖిల్ 18వ ఓవర్లో 4, 6, 6తో అమెరికాకు రికార్డు ఛేదనను అందించాడు. మూడో వికెట్‌కు జోన్స్, గోస్ కలిపి 131 పరుగులు జోడించడం గమనార్హం. కెనడా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు.

**బ్యాటర్లు మెరిసినా..:**

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన కెనడా సైతం ధాటిగానే ఆడింది. ఓపెనర్లు ఆరోన్ జాన్సన్ (23), నవ్‌నీత్ తొలి వికెట్‌కు 43 పరుగులు జోడించారు. జాన్సన్ ఔట్ అయినా నికోలస్‌తో కలిసి నవ్‌నీత్.. వేగంగా ఆడాడు. వీరికి అడ్డుకట్ట వేసేందుకు అమెరికా ఏకంగా ఏడుగురు బౌలర్లను ఉపయోగించినా ఈ జోడీ దూకుడు తగ్గలేదు. 37 బంతుల్లో అర్ధ శతకాలు పూర్తిచేశాక కొద్దిసేపటికే ఈ ఇద్దరూ పెవిలియన్ చేరినా ఆఖర్లో శ్రేయస్ మొవ్వ (16 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడి కెనడాకు భారీ స్కోరును అందించాడు.

2 టీ20 వరల్డ్ కప్ ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (10) బాదిన రెండో బ్యాటర్ జోన్స్. గతంలో ఈ రికార్డు క్రిస్ గేల్ (11) పేరిట ఉంది.

3 పొట్టి ప్రపంచకప్‌లో ఇది మూడో అత్యుత్తమ ఛేదన. ఇంగ్లాండ్ (సౌతాఫ్రికాపై 230), సౌతాఫ్రికా (విండీస్‌పై 206) తర్వాత అమెరికా నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు:

కెనడా: 20 ఓవర్లలో 194/5 (నవ్‌నీత్ 61, నికోలస్ 51, హర్మీత్ 1/27, అండర్సన్ 1/29) యూఎస్ఏ: 17.4 ఓవర్లలో 197/3 (జోన్స్ 94 నాటౌట్, ఆండ్రిస్ 65, డిల్లాన్ 1/19, కలీమ్ 1/34)

# లేటు వయసులోనూ ఇరగదీస్తున్న వీస్




నమీబియా వెటరన్ ఆల్‌రౌండర్ డేవిడ్ వీస్ (39) లేటు వయసులో అదిరిపోయే ప్రదర్శనలతో ఇరదీస్తున్నాడు. గత కొంతకాలంగా నమీబియా విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న వీస్..

ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్ 2024లోనూ చెలరేగిపోతున్నాడు. వరల్డ్‌కప్ గ్రూప్-బి పోటీల్లో భాగంగా ఒమన్‌తో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో వీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటి నమీబియాను గెలిపించాడు. నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ మ్యాచ్‌లో నమీబియా సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. రెగ్యులర్ మ్యాచ్‌లో బ్యాట్‌తో బంతితో సత్తా చాటిన వీస్.. సూపర్ ఓవర్‌లోనూ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు.

రెగ్యులర్ మ్యాచ్‌లో తొలుత బంతితో (3.4-0-28-3) రాణించిన వీస్.. ఆ తర్వాత బ్యాట్‌తోనూ (8 బంతుల్లో 9 నాటౌట్‌బీ ఫోర్) పర్వాలేదనిపించాడు. అనంతరం ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీయగా.. సూపర్ ఓవర్‌లోనూ వీస్ ఇరగదీశాడు. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాట్‌తో (4 బంతుల్లో 13 నాటౌట్‌బీ ఫోర్, సిక్స్) చెలరేగిన వీస్.. ఆతర్వాత బంతితోనూ (1-0-10-1) రాణించి నమీబియాను ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ మ్యాచ్ ఆధ్యాంతం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇరగదీసినందుకు గాను వీస్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్.. నమీబియా బౌలర్ల ధాటికి 19.4 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌటైంది. నమీబియా బౌలర్లలో వీస్‌తో పాటు ట్రంపెల్‌మన్ (4-0-21-4), ఎరాస్మస్ (4-0-20-2), స్కోల్జ్ (4-0-20-1) సత్తా చాటారు. ఒమన్ ఇన్నింగ్స్‌లో ఖలీద్ కైల్ (34) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన నమీబియా.. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఒమన్ చేసినన్ని పరుగులే (109) చేయగలిగింది. ఒమన్ బౌలర్లలో మెహ్రాన్ ఖాన్ (3-1-7-3), కెప్టెన్ ఆకిబ్ ఇలియాస్ (4-1-17-1) అద్భుతంగా బౌలింగ్ చేశారు. బిలాల్ ఖాన్, అయాన్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. నమీబియాను విజయతీరాలకు చేర్చేందుకు ఫ్రైలింక్ (45) పోరాడినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.

సూపర్ ఓవర్ విషయానికొస్తే.. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా వీస్, ఎరాస్మస్ (2 బంతుల్లో 8 నాటౌట్‌బీ 2 ఫోర్లు) రాణించడంతో 21 పరుగులు చేసింది. అనంతరం 22 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్.. వీస్ ధాటి?కి 10 పరుగలకే పరిమితమై ఓటమిపాలైంది.

# స్వియాటెక్ ఫటాఫట్...



ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్యా ప్లేయర్‌పై 6-0, 6-0తో విజయం

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో 'హ్యాట్రిక్' టైటిల్‌పై గురి పెట్టిన ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఆ దిశగా మరో అడుగు వేసింది. జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ అదరగొట్టింది.

రష్యా ప్లేయర్ అనస్తాసియా పొటపోవాతో జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్) 6-0, 6-0తో ఘనవిజయం సాధించింది. కేవలం 40 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

13 విన్నర్స్ కొట్టిన ఆమె నెట్ వద్ద ఆరు పాయింట్లు గెలిచింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-1, 6-2తో ఎలిసబెట్టా కొక్కైరెట్టో (ఇటలీ)పై, ఐదో సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-4, 6-2తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

అల్‌కరాజ్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అల్‌కరాజ్ 6-3, 6-3, 6-1తో అగుర్ అలియాసిమ్ (కెనడా)పై, సిట్సిపాస్ 3-6, 7-6 (7/4), 6-2, 6-2తో మాటియో అర్నాల్డి (ఇటలీ)పై గెలుపొందారు.

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్ మ్యాచ్‌లో విజయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 4 గంటల 29 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 7-5, 6-7 (6/8), 2-6, 6-3, 6-0తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 7-5, 4-6, 6-4తో ఒర్లాండో లుజ్-మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్) జంటను ఓడించింది.

రెండో రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్‌లతో ఆడాల్సిన సెబాస్టియన్ బేజ్ (అర్జెంటీనా)-థియాగో వైల్డ్ (బ్రెజిల్) టోర్నీ నుంచి వైదొలిగారు. దాంతో బోపన్న-ఎబ్డెన్ రెండో రౌండ్ మ్యాచ్ ఆడకుండానే నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ వరేలా (మెక్సికో)లతో బోపన్న-ఎబ్డెన్ ఆడతారు.

# అమిత్, జైస్మీన్‌కు పారిస్ బెర్తు

### బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్

బ్యాంకాక్: భారత యువ బాక్సర్లు అమిత్ పంగల్, జైస్మీన్ లంబోరియా పారిస్ ఒలింపిక్స్ బెర్తులు దక్కించుకున్నారు.

బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న రెండవ బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భాగంగా ఆదివారం పురుషుల 51 కిలోల విభాగం క్వార్టర్స్‌లో అమిత్.. 5-0తో చైనా బాక్సర్ చువాంగ్ లియును చిత్తు చేసి పారిస్ కోటా సాధించాడు. మహిళల 57 కిలోల క్వార్టర్స్‌లో జైస్మీన్.. 5-0తో మారిన్ (మాలి)పై నెగ్గి భారత్‌కు ఒలింపిక్స్‌లో ఆరో బెర్తును అందించింది. పురుషుల 57 కిలోల విభాగంలో సచిన్ సివాచ్ ఓటమిపాలై నిరాశపరిచాడు. భారత్ తరఫున నిఖత్ జరీన్ (50 కిలోలు), ప్రీతి (54 కిలోలు), లవ్లీనా బొర్గొహెయిన్ (75 కిలోలు)



పారిస్ కోటాలను గతంలోనే దక్కించుకోగా తాజా టోర్నీలో నిషాంత్ దేవ్ (71 కిలోలు), అమిత్, జైస్మీన్‌తో కలిపి ఆ సంఖ్య ఆరుకు చేరింది.

# 'పంగల్' పంచ్ అదుర్స్.. ఒలింపిక్ పతకం గెలుస్తాడా..?



భారత యువ బాక్సర్ అమిత్ పంగల్ విశ్వ వేదికపై తన పంచ్ పవర్ చూపించాడు. కీలక పోరులో చైనా బాక్సర్‌ను చిత్తుగా ఓడించి 51 కిలోల విభాగంలో ప్యారిస్ ఒలింపిక్స్ బెర్తు ఖాయం చేసుకున్నాడు. తద్వారా భారత్ నుంచి విశ్వక్రీడలకు అర్హత సాధించిన ఐదో బాక్సర్‌గా పంగల్ రికార్డు నెలకొల్పాడు.

ఆదివారం జరిగిన క్వాలిఫయర్స్ క్వార్టర్స్‌లో అమిత్ రెచ్చిపోయాడు. చైనాకు చెందిన లూ చౌంగ్‌పై పంచ్‌ల వర్షం కురిపించి 5-0తో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లాడు. దాంతో, నిశాత్ దేవ్ తర్వాత ఒలింపిక్స్ బెర్తు ఖాయం చేసుకున్న రెండో పురుష బాక్సర్‌గా అమిత్ నిలిచాడు. రెండు రోజుల క్రితమే యువకెరటం నిషాంత్ దేవ్ ప్యారిస్ ఒలింపిక్స్ బెర్తు సాధించాడు. 71 కిలోల విభాగంలో విశ్వ క్రీడలకు అర్హత సాధించాడు. వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో నిషాంత్.. మొల్డోవా బాక్సర్ వెసిలే సెబొటరీ కి ముచ్చెమటలు పట్టించాడు. మ్యాచ్ ఆసాంతం పంచ్‌ల వర్షం కురిపించిన నిశాంత్ 5-0తో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. తద్వారా ఒలింపిక్స్ బెర్తు ఖాయం చేసకున్నాడు.

బరిలో ఐదుగురు

ప్రస్తుతానికి పంగల్‌తో కలిపి ఐదుగురు బాక్సర్లు ఒలింపిక్స్ పోటీలకు అర్హత సాధించారు. ఇందూరు బిడ్డ నిఖత్ జరీన్(50 కిలోలు), ఈశాన్య రాష్ట్రానికి చెందిన లొవ్లినా బొర్గొహెన్(75 కిలోలు), ప్రీతి పవార్(54 కిలోలు), నిశాంత్ దేవ్(71 కిలోలు), అమిత్ పంగల్(51 కేజీ) లు విశ్వ క్రీడల్లో పతకంపై గురి పెట్టారు.

# వెస్టిండీస్‌ను భయపెట్టిన పసికూన.. చెమటోడ్చి నెగ్గిన కరేబియన్లు

### ఐదు వికెట్లతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచింది
### ఆకట్టుకున్న పపువా బౌలర్లు
### విండీస్‌ను గెలిపించిన చేజ్

గయానా: టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న రెండో దేశం వెస్టిండీస్ కూడా టోర్నిలో శుభారంభం చేసింది.

ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్ విండీస్ ఓటమి అంచుల్లోంచి బయటపడి 5 వికెట్ల తేడాతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచి ఊపిరి పీల్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు టోని వుర (2), అసద్ వాలా (21), లెగా సియాక (1) నిరాశ పరచడంతో 34 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో సెసె బావు (43 బంతుల్లో 50బీ 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. చార్లెస్ అమిని (12)తో ఐదో వికెట్‌కు 44 పరుగులు జోడించాడు. జట్టు స్కోరు 98 వద్ద ఆరో వికెట్‌గా సెసె బావు నిష్క్రమించగా, కిప్లిన్ డొరిగా (18 బంతుల్లో 27 నాటౌట్‌బీ 3 ఫోర్లు) మెరుగ్గా ఆడటంతో పపువా ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రసెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ చేజ్ (27 బంతుల్లో 42 నాటౌట్‌బీ 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) విండీస్‌ను ఒడ్డున పడేసే ఆట ఆడాడు.



సులువైన ప్రత్యర్థే అయినా... ఏమంత కష్టం కానీ లక్ష్యమే ఎదురైనా... వెస్టిండీస్ గెలిచేందుకు ఆపసోపాలు పడింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్, పూరన్ ఉన్నంత వరకు 8 ఓవర్లలో విండీస్ 61/1 స్కోరు చేసింది. గెలిచేందుకు 72 బంతుల్లో 76 పరుగులు చేస్తే సరిపోతుంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో పూరన్ (27 బంతుల్లో 27బీ 1 ఫోర్, 2 సిక్స్‌లు), కింగ్ (29 బంతుల్లో 34బీ 7 ఫోర్లు) అవుటయ్యాక పరిస్థితి మారింది.

కెప్టెన్ రొవ్‌మన్ పావెల్ (15), రూథర్‌ఫోర్డ్ (2) వికెట్లు పారేసుకోవడంతో సమీకరణం 24 బంతుల్లో 40 పరుగుల వద్ద కష్టంగా కనిపించింది. ఈ దశలో రసెల్ (9 బంతుల్లో 15 నాటౌట్‌బీ 1 సిక్స్) వచ్చాక చేజ్ ధాటిగా ఆడాడు. 18వ ఓవర్లో 2 బౌండరీలు, ఓ సిక్స్ బాది 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్లోనూ చేజ్ 2 ఫోర్లు కొట్టడంతో 19వ ఓవర్ ఆఖరి బంతికి లక్ష్యాన్ని చేరుకుంది.

# ఆ విషయంలో ఎంఎస్ ధోనీ - రోహిత్ శర్మ ఒకటే: కైఫ్

ఇంటర్నెట్ డెస్క్: టెక్నాలజీని, గేమ్‌ను అర్థం చేసుకోవడంలో ఎంఎస్ ధోనీకి తిరుగులేదని భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు.



అతడి బాటలోనే ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ ముందుకుసాగుతున్నాడని కైఫ్ పేర్కొన్నాడు. వీరిద్దరూ సాంకేతిక అంశాలను క్రికెట్‌లో వాడుకోవడంలో ముందున్నారని తెలిపాడు. ధోనీ మిగతా వారందరికీ మినహాయింపు, రోహిత్ కూడా ఇందులో మాస్టర్స్ చేసినట్లు అనిపిస్తోందని చెప్పాడు.

"మ్యాచ్‌లో టెక్నాలజీ, కామన్‌సెన్స్‌ను బ్యాలెన్స్ చేయడాన్ని ధోనీ, రోహిత్ సాధించారు. గేమ్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో కంప్యూటర్ కూడా అంచనా వేయలేదు. ఆటగాళ్లు, సిబ్బంది ఎన్నిసార్లు చర్చించినా వేస్టే. ఆ మ్యాచ్ రోజు తీవ్ర ఒత్తిడిలోనూ ఇంగిత జ్ఞానాన్ని ప్రదర్శించడం అత్యంత కీలకం. మానసికంగా మనం ఎంత బలంగా ఉన్నామనేది తెలియజేస్తుంది. ఇందులో ధోనీని మించిన ఉదాహరణ మరెవరూ ఉండరు. నాయకుడిగా ధోనీ ఆలోచనలు విభిన్నంగా ఉంటాయి. చివరి ఓవర్ సమయంలో బౌలర్ చాలా ఒత్తిడిలో ఉంటాడు. అయితే, ధోనీ చూసే విధానం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒకవేళ బౌలర్ సిక్స్ ఇచ్చినా.. మరొక బంతి వరకూ వెయిట్ చేయ్ అని చెబుతాడు. ఇలా అందరూ చెప్పలేరు. ఆటగాళ్లకు ఇలాంటి స్వేచ్ఛ ఇస్తే వారి మైండ్‌సెట్ కూడా మారిపోతుంది. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు అవకాశం ఉంటుంది" అని కైఫ్ వెల్లడించాడు.

ఆటగాళ్లపై ఎలాంటి ఆంక్షలు లేవు!

భారత్ ఆడే క్రికెట్ మ్యాచ్‌లకు ఉగ్ర ముప్పు ఉందనే వార్తల నేపథ్యంలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆటగాళ్లు కూడా న్యూయార్క్ వీధుల్లో తిరుగుతున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. ప్లేయర్లపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్‌తో వార్మప్ మ్యాచ్ అనంతరం క్రికెటర్లు సరదాగా గడిపారు. జూన్ 5న ఐర్లాండ్‌తో టీమ్ఇండియా తొలి మ్యాచ్ ఆడనుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**